సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి: 17 | సంచిక: 133
పేజీలు: 08 | వెల: రూ.2:00

హైదరాబాద్ | సోమవారం 11 మే 2026

Published from Hyderabad, Vijayawada.



## ఇరాన్ శాంతి ప్రతిపాదన పూర్తిగా ఆమోదయోగ్యం కాదు

### ఇరాన్ ప్రతిపాదనపై డోనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి

నాలుగు నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో ఇరాన్ పంపిన శాంతి ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. పాకిస్థాన్ మధ్యవర్తుల ద్వారా పంపిన ఈ ప్రతిపాదనలు పూర్తిగా ఆమోదయోగ్యం కావని ట్రంప్ తేల్చి చెప్పారు. యుద్ధాన్ని శాశ్వతంగా మిగతా 2 లో..



## అసోం సీఎంగా హిమంత

### మే 12న ప్రమాణ స్వీకారం

అసోం ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిన హిమంతను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమిస్తున్నట్లు ఆదివారం రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు మిగతా 2 లో..



## ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మీషన్లు

### ఇంటర్ అడ్మిషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ అడ్మీషన్లను యథావిధిగా కొనసాగించనున్నట్లు ప్రభుత్వం మిగతా 2 లో..



## రాజకీయంగా ఎదుర్కోలేక ఏదో కుట్రలు

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

జై శ్రీరామ్ అంటే మాలో ఆవేశాన్ని నింపుతోంది, ఆలోచనలు నింపుతుంది. మాలో పౌరుషాన్ని నింపుతుంది. జై శ్రీరామ్ నినాదమే కేసీఆర్ కుటుంబ గడీలు బద్దలుకొట్టి మిమ్మల్ని మిగతా 2 లో..



# తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- తెలంగాణ ప్రజల నుంచి కనిపిస్తోంది
- దేశం మొత్తం మార్పు కోరుకుంటోంది
- బంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలు
- రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీఏ కట్టుబడి ఉంది
- యుద్ధం ఏదైనా.. భారం పడనివ్వను
- బంగారం, పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలి
- బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ బహిరంగ సభ
- రాష్ట్రంలో ప్రధాని పర్యటన.. ప్రారంభోత్సవాలు
- 9,400 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కాషాయం జెండాను రెపరెపలాడించాలనేది బీజేపీ ప్రధాన లక్ష్యం.. అదే వ్యూహంతోని ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారు. పొత్తులతోనైనా లేదా ఒంటరిగానైనా ఒక్కో రాష్ట్రంలో బీజేపీ జెండాను పాతుకుంటూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది వస్తోంది. ఈ సూత్రంలోనే చరిత్రను తిరగరాస్తూ బెంగాల్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది బీజేపీ. ఇప్పుడు ఫోకస్ తెలంగాణపై పెట్టింది. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు తత్యమని ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్ సభలో మాట్లాడడం తెలంగాణ నేతల్లో జోష్‌ను పెంచేసింది.**

పశ్చిమ బంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పశ్చిమబంగాల్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించిందని గుర్తు చేశారు. అక్కడి ప్రజలు చేసిన ప్రతిజ్ఞ ప్రకారం బీజేపీని గెలిపించుకున్నారని కొనియాడారు. తెలంగాణ ప్రజల నుంచి కూడా అలాంటి ఉత్సాహమే కనిపిస్తోందని చెప్పారు. తెలంగాణలో ఈసారి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణుల నినాదాలు : అంతకుముందు తన కోసం కార్యకర్తలు తెచ్చిన పెయింటింగ్స్‌ను సేకరించాలని ప్రధాని ఎస్పీజీని ఆదేశించారు. పెయింటింగ్స్ వేసిన చిత్ర కళాకారులకు తిరిగి లేఖలు రాస్తానని చెప్పారు. ప్రియమైన తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. మోదీని చూసిన ఆనందంలో బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలతో సభ ప్రాంగణాన్ని హోరెత్తించారు. రాజకీయాల్లో గెలుపోటములు మిగతా 3 లో..

# అభివృద్ధికి సహకరించండి

- మీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి
- తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలి
- వికసిత్ భారత్‌తో మా ప్రభుత్వం కలిసి నడుస్తోంది
- 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా ముందుకు
- 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- దేశానికి 10 శాతం జీడీపీ ఇస్తామని వాగ్దానం చేస్తున్నా
- హెచ్ఐసీసీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- సైబరాబాద్ అతి పెద్ద ఉపాధి కేంద్రంగా మారింది
- దేశాభివృద్ధిలో సైబరాబాద్ కీలక పాత్ర పోషిస్తోంది
- తెలంగాణకు దేశానికి పెద్ద ఉత్పత్తి తయారీ కేంద్రం
- సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో కీలక పాత్ర
- రాష్ట్రాల అభివృద్ధి లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాదు
- హెచ్ఐసీసీ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ






ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదని, ఇది అభివృద్ధి ఉత్సవమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ముందుకెళ్లేందుకు అవసరమైన అభివృద్ధి ఉత్సవమని, ప్రధాని ప్రణాళిక అయిన వికసిత్ భారత్‌తో కలిసి నడుస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ప్రధాని మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానితో పాటు రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయిపోయాయని, ఇప్పుడు రాజకీయాలు మాట్లాడాల్సిన పని లేదని రేవంత్ పేర్కొన్నారు. అభివృద్ధి గురించే మాట్లాడదామని వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పెట్టుకున్నామని గుర్తు చేసిన ఆయన, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని తెలంగాణ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. 2034 నాటికి తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ ఆశీర్వాదం ఉంటే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందని, కేంద్ర మంత్రులను మిగతా 3 లో..

# చెప్పిందే చేస్తా..



- తమిళనాడులో ఇప్పుడు ప్రజా ప్రభుత్వం
- మిత్రులైనా శత్రువులైనా అందరికీ ఒకే చట్టం
- తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ వెల్లడి
- తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం
- ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం

తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జోసెఫ్ విజయ్, ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఆ తర్వాత యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్, మహిళల రక్షణకు ప్రత్యేక దళం దస్త్రాలపై విజయ్ సంతకాలు చేశారు. తమిళనాడుకు ఇది సరికొత్త ప్రారంభమని ప్రమాణస్వీకార కార్యక్రమంలో వెల్లడించారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో మిగతా 3 లో..

## నేటి నుంచి విద్యా వారోత్సవాలు

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెల 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాలు ప్రభుత్వ టీచర్లకు తలనొప్పులు తెచ్చిపెట్టాయి. సోమవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించే సభకు విద్యార్థులను సమీకరించడం ఉపాధ్యాయులకు సమస్యగా మారింది. ఈ సభకు 20 వేల మంది విద్యార్థులను సమీకరించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల నుంచి విద్యార్థులను తరలించాలని సూచించింది. ఒక్కో జిల్లా నుంచి 4వేలకు తగ్గకుండా చూడాలని తెలిపింది. రాష్ట్రంలో విద్యాసంవత్సరం ముగియగా బడులు, కాలేజీలకు వేసవి సెలవులు వచ్చాయి. ఈ సెలవుల్లోనే విద్యాశాఖ వారోత్సవాలను తలపెట్టింది.

# కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం

- బండి సంజయ్ కుమారుడిపై చర్యలేవి?
- 48గంటలైనా చర్యలెందుకు తీసుకోలేదు?
- బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు



రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం నడుస్తున్నదని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడి పోక్సో కేసు వ్యవహారంపై ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. ప్రభుత్వ, పోలీసుల వైఫల్యాలను ఎత్తిచూపారు. 'బాధితురాలు న్యాయం కోసం మిగతా 2 లో..

# సంపాదకీయం

## కొనుగోళ్ల కోసం పడిగాపులు

ఏటా దేశంలో ధాన్యం కొనుగోళ్లు అన్నది ఓ పజిల్‌గా మారింది. పెద్ద ఎత్తున ధాన్యం కొంటున్నామని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటిస్తుంటాయి. క్షేత్రస్థాయిలో మాత్రం అది కానరావడం లేదు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే ధాన్యం కొనండి అని రైతులు లబోదిబోమంటున్నారు. అయినా కొనుగోళ్లు పెద్ద ఎత్తున ఎక్కడా కానరావడం లేదు. దీనికితోడు అకాల వర్షం రైతుల నెత్తిన పిడుగు పడేసింది. ఇటీవలి అకాల వర్షం నిండా ముంచింది. అన్నదాత రెక్కలకష్టాన్ని నీళ్లపాల్జేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుప్రాంతాల్లో పడిన వర్షం దాటికి, మార్కెట్ యార్డుల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. పలు గ్రామాల్లో తీవ్రమైన గాలులతో అకాల వర్షం కురవడంతో మంథని మార్కెట్ యార్డుతోపాటు ఆయా మండలాల్లోని వ్యవసాయ ధాన్యమంతా మట్టిలో కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పదిహేను రోజుల కిందటే కోతలు కోసి, ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి కొనుగోళ్ల కోసం పడిగాపులు పడుతున్న తరుణంలో కోలుకోలేని దెబ్బతీసింది. కొనుగోళ్లు వేగంగా చేస్తే తమ ధాన్యం తడిసేది కాదని కుప్పల చుట్టూ వర్షం నీటిని చూపిస్తూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసి ముద్దయిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని మంత్రులు, అధికారులు పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. అసలు ధాన్యమే కొనడం లేదని తెలంగాణలో బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. మక్కల కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల రైతులు కుప్పలమీదే ప్రాణాలు వదిలిన ఘటనలు చూస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. బిఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందన్నారు. ఎపిలో కూడా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతు న్నాయని మంత్రి అచ్చన్నాయుడు చెబుతున్నారు. మరి లోపం ఎక్కడో తెలియడం లేదు. కేంద్రం కూడా దేశంలో ఏయే పంటలు పండుతున్నాయో, వాటిని ప్రజలకు చేర్చడమెలా అన్నది ఆలోచన చేయడం లేదు. పంటులు బాగానే పండుతున్నాయి. గోదాముల్లో ఫుల్లుగా ఉంటున్నాయి. రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ప్రజలకు ధరలు అందుబాటులో ఉండడం లేదు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించి పరిష్కరించే చిత్తశుద్ధి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో కానరావడం లేదు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో గోధుమల సేకరణ ఎక్కువగా జరుగుతుంది. అక్కడి ధరలు ఎంఎస్‌పీకి చేరువగా ఉంటాయి. గోధుమల సేకరణ పరిమితంగా ఉండే రాష్ట్రాల్లో మాత్రం ధరలు పడిపోతుంటాయి. ఈ అసమానత రైతులు సంపాదించే దానికి, వినియోగ దారుడు చెల్లించే దానికి మధ్య అంతరాన్ని మరింతగా పెంచుతోంది. మార్కెట్ నియంత్రణ సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ధరల పర్యవేక్షణ విభాగం ఉంటుంది. అయితే అది కేవలం సమాచారాన్ని సేకరిస్తోందా లేక అడ్డూ అదుపూ లేని ధరలను నియంత్రిస్తోందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గోధుమల ధర తగ్గితే రైతుకు గిట్టుబాటు ధర లభించదు. వినియోగదారుడికీ ఉపశమనం కలగదు. మరి ప్రయోజనం పొందేది ఎవరు? మధ్యలో ఉన్న కొద్ది మంది దళారులు మాత్రమే. పంజాబ్, హర్యానాల్లో గోధుమలు బాగా పండిస్తారు. గోధుమల ధర తగ్గితే సహజంగానే గోధుమ పిండి ధర కూడా తగ్గుతుంది. తద్వారా ప్రజలకు ఊరట లభిస్తుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా గోధుమల ధరలు తగ్గినప్పటికీ దాని ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. రైతులు గోధుమలను కనీస మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తున్నప్పటికీ మార్కెట్‌లో గోధుమ పిండి, బ్రెడ్ ధరలు మాత్రం దిగిరావడం లేదు. వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఇటీవలి కాలంలో గోధుమల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈ నెలలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని హోల్‌సేల్ మండీల్లో కిలో గోధుమల ధర రూ.23 నుంచి రూ.25 మధ్య నడుస్తోంది. చాలా వరకూ కిలో ధర రూ.25.85 పలికినప్పటికీ అది ఎంఎస్‌పీ కంటే తక్కువగానే ఉంది. గత సంవత్సరం నరేంద్ర మోడీ ప్రభుత్వం గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.160 పెంచి రూ.2,585గా నిర్ణయించింది. 2024–25లో ఇది రూ.2,425గా ఉంది. గోధుమల ధర తగ్గినప్పుడు సహజంగానే పిండి ధర కూడా తగ్గాలి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.36 నుంచి రూ.40 మధ్య పలుకుతోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల విషయానికి వస్తే కిలో ధర రూ.40 నుంచి రూ.50 మధ్య నడుస్తోంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇది రైతుకు నష్టమా లేక వినియోగదారుడికి లాభమా లేక వినియోగదారుడి పేరుతో వేరెవరైనా లాభాలు గడిస్తున్నారా అన్నదే ఇక్కడ ప్రశ్న. గోధుమ పిండి ధర పెరిగినప్పుడు మిల్లు యజమానులు, కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల నెత్తిన వేస్తాయి. కానీ పిండి ధర తగ్గినప్పుడు ధరలను తగ్గించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. లాభాల మార్జిన్‌ను కాపాడుకోవడానికి, వీలైతే దానిని మరింతగా పెంచుకోవడానికి వీలుగా వారు ఇలా వ్యవహరి స్తుంటారు. దేశంలో ప్రతి పంట పరిస్థితి ఇలాగే ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, మక్క రైతులు నాన కష్టాలు పడుతున్నారు. దీనికంతటికి కొనుగోలు విధానాలు, మద్దతు ధరల విధానాలు సక్రమంగా లేకపోవడమే అని గుర్తించాలి. దీనిని సంస్కరిస్తే తప్ప రైతులకు, వినోగదారులకు మనశ్శాంతి ఉండదు.

## రాజకీయంగా ఎదుర్కోలేక ఏదో కుట్రలు

మొదటిపేజీ తరువాయి..

ఫాం హౌస్‌కు పరిమితం చేసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఏరోజూ పార్టీ తలవంచుకునే పని చేయలేదన్నారు. తాను బీజేపీ కార్యకర్తనని జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అని నినాదం చేసేవాడ్ని.. ఏ తప్పు చేయలేదన్నారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఫాం హౌస్‌లో ఎలుకని కాదని, అయ్య పేరు, తాత పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదని.. కాషాయ జెండాను భుజంపై మోసిన వ్యక్తినన్నారు. యువ మోర్చా కార్యకర్తగా, ఏబీవీపీ కార్యకర్త, బీజేపీ కార్యకర్తగా, మోదీ శిష్యుడిగా ఎప్పుడూ తలవంచే ప్రసక్తే లేదన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ నిర్వహించిన భారీ బహిరంగసభలో బండి సంజయ్ మాట్లాడుతూ.. 'ప్రధాని నరేంద్ర మోదీ ఈ నినాదంతోనే 9,400 కోట్ల రూపాయలు తెలంగాణకు ఇచ్చారు. జై శ్రీరామ్ నినాదంతోనే రాష్ట్రానికి నిధులు ఇస్తున్నారు. మోదీ లేకపోతే తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం నడవదు. మేం కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు ఇస్తుంటే.. ఇక్కడి కాంగ్రెస్ పాలకులు ఢిల్లీకి మూటలు మోస్తున్నారు.తెలంగాణ ఎన్నికల సమయంలో రాష్ట్రానికి వచ్చిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ ఆరు గ్యారంటీల హామీలు ఇచ్చారు. వాటిని అమలు చేయలేక కాంగ్రెస్ పెద్దలు తెలంగాణకు రావడం మానేశారు. రాష్ట్రానికి రావడానికి ముఖం చాటేస్తున్నారు. బెంగాల్‌లో అంత ఈజీగా బీజేపీ గెలవలేదు. అనేక మంది కార్యకర్తలు బలిదానంతో అధికారం సాధ్యమైంది. మహిళా మోర్చా కార్యకర్తల్ని హత్యాచారం చేశారు. ఇంట్లో కట్టేసి ఎంతో మందిని నిప్పు పెట్టి సజీవ దహనం చేశారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతో అమిత్ షా, నరేంద్ర మోదీలు బెంగాల్‌లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చారు. కేరళలో ఓ ఏబీవీపీ ర్యాలీకి వెళ్లాను. ఓ నేత అద్భుతంగా స్పీచ్ ఇచ్చారు. ఆయన స్పీచ్ ఇస్తుంటే మధ్యలో కన్ను బయటకు వచ్చింది. అంతా ఆశ్చర్యపోయాం. పీఎఫ్ఐ మైనారిటీ గూండాలు నా చేతులు కట్టేసి నా కళ్లు పీకేశాయి. అయినా తాను పారిపోయే వ్యక్తిని కాదని దేశం కోసం ధైర్యం కోసం పోరాటం చేస్తున్నారు. రాజ్యసభలో సుందరం మాస్టర్ రెండు కాళ్లు నరికేస్తే పెట్టుడు కాళ్లతో పనిచేస్తున్నారు. ఆయనకు ప్రధాని మోదీ రాజ్యసభ ఛాన్స్ ఇచ్చారు. అక్కడక్కడా చిన్న చిన్న విభేదాలు ఉంటాయి. వాటన్నింటిని పక్కనపెట్టి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువద్దాం. కార్యకర్తలు, అమరవీరుల బలిదానాలకు అప్పుడే విలువు ఉంటుంది. తెలంగాణ రాష్ట్రానికి నిధులిచ్చేది మనం. అభివృద్ధి చేసేది మనం. కానీ తెలంగాణ ప్రభుత్వం ధాన్యం



కొంటలేదు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇంతవరకూ కొనుగోలు చేయడకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ లేదు. విద్యార్థులకు, నిరుద్యోగులకు భరోసా లేదు. రైతు భరోసా లేదు, రైతు బోనస్ లేదు. కేవలం ఢిల్లీకి పైసలు పంపడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజనకు, రైల్వేకు నిధులు, కొనుగోలు కేంద్రాలకు, శ్మశాన వాటికలకు నిధులు కేంద్రం ఇస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం బద్నాం చేసే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్ర అభివృద్ధి కోసం మనం పనిచేద్దాం. ఏ వర్గానికి కొమ్ముకాయం. సనాతన ధర్మాన్ని కించపరిచేస్తే బీజేపీ కార్యకర్త చూస్తూ ఊరుకోదని గుర్తుంచుకోవాలని' అన్నారు.

## ఇరాన్ శాంతి ప్రతిపాదన పూర్తిగా ఆమోదయోగ్యం కాదు

మొదటిపేజీ తరువాయి..

ముగించడమే లక్ష్యంగా చర్చలు సాగాలని ఇరాన్ కోరుతుండగా, ట్రంప్ మాత్రం వారి డిమాండ్లను కొట్టిపారేశారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు. ఇరాన్ ప్రతినిధుల నుంచి వచ్చిన సమాధానాన్ని ఇప్పుడే చదివాను. అది నాకు అస్సలు నచ్చలేదు. పూర్తిగా ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంపై మీరు శ్రద్ధ చూపినందుకు ధన్యవాదాలు' అని ట్రంప్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. యుద్ధం ముగింపు కోసం ఆదివారం ఇరాన్ నుంచి అమెరికాకు ప్రతిపాదన అందింది. అందులో కేవలం ఒకే చోట కాకుండా లెబనాన్‌లో పోరాటం సహా అన్ని రంగాల్లోనూ యుద్ధం వెంటనే ముగించాలని, సముద్ర మార్గాల్లో రవాణాభద్రతకు గ్యారంటీ ఉండాలని ఇరాన్ డిమాండ్ చేసింది. అమెరికా చేసిన ప్రతిపాదనల్లో యుద్ధం ముగింపుతో పాటు, హర్మూజ్ పునరుద్ధరణ, అణు కార్యక్రమాన్ని ఇరాన్ వెనక్కి తీసుకోవడం వంటి అంశాలు ఉన్నాయి. అయితే అణు చర్చలను ప్రస్తుతానికి వాయిదా వేయాలని ఇరాన్ భావిస్తోంది.

మరోవైపు మెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఒకేసారి డజనుకుపైగా పోస్ట్‌లను షేర్ చేశారు. శనివారం రోజు దాదాపు ఏడు గంటల పాటు ఎలాంటి పోస్ట్‌లూ చేయకుండా ఉన్న ట్రంప్, మధ్యాహ్నం 3:51 గంటల నుంచి ఒక్కసారిగా వరుస పెట్టి పోస్ట్‌లు చేశారు. ఈ పోస్ట్‌లలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఏఐ)తో సృష్టించిన సముద్ర యుద్ధ ఫొటోలు, ఒక గోల్ఫ్ ఈవెంట్‌కు సంబంధించిన స్నాప్‌షాట్‌లు ఉన్నాయి. ట్రంప్ పోస్ట్ చేసిన ఏఐ సముద్ర యుద్ధ ఫొటోలన్నీ అమెరికా– ఇరాన్ సైనిక ఘర్షణతో ముడిపడినవే. ౹ ట్రంప్ పోస్ట్ చేసిన ఒక ఏఐ ఫొటోలో రెండు ఫ్రేమ్‌లు ఉన్నాయి. కుడి వైపునున్న ఫ్రేమ్‌లో, ఇరాన్ చిహ్నాలను కలిగిన డ్రోన్లు సముద్రంలోకి కూలిపోతున్నట్లుగా ఏఐ ఫొటో ఉంది. ఎడమ వైపునున్న ఫ్రేమ్‌లో, సీతాకోకచిలుకలు సముద్రంలో పడిపోతున్నట్టుగా ఏఐ ఫొటో ఉంది. ఈ ఫొటోపై 'సీతాకోకచిలుకల్లా రాలిపోతున్నాయి' అనే క్యాప్షన్‌ను ట్రంప్ పెట్టారు. ౹ అమెరికన్ నౌక లేజర్ కిరణాలను విడుదల చేసి ఇరాన్ డ్రోన్లను పేల్చేస్తున్నట్లుగా ఉన్న మరొక ఏఐ ఫొటోను ట్రంప్ పోస్ట్ చేశారు.

దీనిపై 'బై బై, డ్రోన్స్' అనే క్యాప్షన్‌ను ఆయన పెట్టారు. ౹ సముద్రంలో దూరంగా మంటల్లో కాలిపోతున్న శత్రుదేశ నౌకను ఒక నౌకలో నుంచి ట్రంప్ బైనాక్యులర్‌తో గమనిస్తున్నట్లుగా ఉన్న మరొక ఏఐ ఫొటోను కూడా పోస్ట్ చేశారు. ౹ ఇక ఇదే సమయంలో తన రాజకీయ ప్రత్యర్థులను విమర్శించేందుకూ ఏఐ ఫొటోలను ట్రంప్ వినియోగించారు. విపక్ష డెమొక్రటిక్ పార్టీకి చెందిన మాజీ అమెరికా అధ్యక్షులు జో బైడెన్, బరాక్ ఒబామాలను ఆయన లక్ష్యంగా చేసుకున్నారు. ఇరాన్ విషయంలో వారి సైనికపరమైన వైఖరిని ఎండగడుతూ ఒక ఏఐ ఫొటోను ట్రంప్ పోస్ట్ చేశారు. అందులో కుడి వైపున 'ట్రంప్' అనే క్యాప్షన్‌తో ఉన్న ఫొటోలో ఇరాన్ నౌకలన్నీ ధ్వంసమై, సముద్రంలో మునిగిపోయి ఉన్నాయి. దీనిలోనే ఎడమ వైపున 'ఒబామా/బైడెన్' అనే క్యాప్షన్‌తో ఉన్న ఫొటోలో ఇరాన్ జెండాలతో ఉన్న నౌకలన్నీ సముద్రంలో తిరుగుతున్నాయి. మొత్తంగా ఈ ఏఐ ఫొటోకు '159 ఇరాన్ నౌకలు' అనే పెద్ద క్యాప్షన్‌ను ట్రంప్ పెట్టారు. ఇరాన్ నౌకలు ఒబామా/బైడెన్ హయాంలో సురక్షితంగా ఉండగా, తన హయాంలోనే ధ్వంసమయ్యాయనే సందేశాన్ని ఆయన ఇచ్చారు.

## కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం



మొదటిపేజీ తరువాయి..

పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే కేసు నమోదుకు ఎనిమిది గంటలు ఎందుకు పట్టింది? కేసు నమోదై 48గంటలు దాటినా నిందితుడిపై చర్యలు తీసుకొనేందుకు పోలీసులు ఎందుకు వెనుకాడుతున్నారు? హోం మంత్రిగా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి?' అంటూ ప్రశ్నలవర్షం కురిపించారు. కేసు నమోదులో తాత్సారం, నిందితుడిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్న తీరు రెండు పార్టీల కుమ్మక్కు రాజకీయాలకు నిదర్శనం కాదా? అని నిలదీశారు.

## 12న బీఆర్ఎస్ పార్టీ కీలక సమావేశం

### కేసీఆర్ అధ్యక్షత ముఖ్య నేతలతో భేటీ

బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఈ నెల 12న పార్టీ కీలక సమావేశం జరుగనున్నది. ఈ మేరకు పార్టీ వర్గాలు ఆదివారం వివరాలు వెల్లడించాయి. ఇటీవల హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి కొనసాగింపుగా మంగళవారం మధ్యాహ్నం



ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి ప్రతిపక్ష నేతతో పాటు మండలి, శాసనసభాపక్షాల డిప్యూటీ లీడర్లు హాజరుకానున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, పార్టీ ఇన్‌చార్జుల నియామకం, బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్యనేతలకు కేసీఆర్ కీలక సూచనలు చేసి బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిసింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న తీరుపై దిశానిర్దేశం చేయనున్నారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన పోరాట కార్యక్రమాలు, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్టు సమాచారం. అదేవిధంగా పరిషత్, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం

అకాల వర్షానికి ధాన్యం, మక్కలు తడిసి ముద్దవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉమ్మడి వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో శనివారం రాత్రి, ఆదివారం భారీ వర్షం కురిసింది. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రానికి 20 రోజుల క్రితం రైతులు మక్కలను తీసుకొచ్చారు. కాంటా పెట్టకపోవడంతోపాటు వాహనాలను సమకూర్చక పోవడంతో రైతులు మండుటెండలో పడరాని పాట్లు పడ్డారు. శనివారం రాత్రి గాలి దుమారంతో వర్షం కురువడంతో ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరులోని మకలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేయకపోవడంతో అకాల వర్షానికి తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

ఈదురు గాలులకు మహబూబాబాద్ మండలం బ్రాహ్మణపల్లి లక్ష్మీపురం, వేంనూరు గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నెల్లికొండ గేట్ సమీపంలోని వ్యవసాయ మార్కెట్‌లో కురిసిన వర్షానికి రైతులు ఆరబోసుకున్న మక్కలు తడిసి ముద్దయ్యాయి. ఆరబోసిన మక్కలు వరద నీటిలో కొట్టుకుపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో రైతులు నిల్వ చేసిన ధాన్యం రాశులు తడిసిపోయాయి.

## అసోం సీఎంగా హిమంత

మొదటిపేజీ తరువాయి..

చేయడానికి మార్గం సుగమమైంది. మే 12వ తేదీ ఉదయం 11:40 గంటలకు ఖానాపారాలోని వెటర్నరీ కళాశాల మైదానంలో హిమంత ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చీఫ్ సెక్రటరీ పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ శాసనసభాపక్ష సమావేశంలో హిమంత బిశ్వ శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన కూటమి భాగస్వామ్య పార్టీల నేతలతో కలిసి లోక్ భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన మద్దతు పత్రాలను గవర్నర్‌కు ఇచ్చారు. ఇక, మంగళవారం జరిగే హిమంత ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు తదితర ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. బీజేపీ కేంద్ర పరిశీలకులుగా నియమితులైన కేంద్ర మంత్రి జేపీ నడ్డా, హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ కూడా హిమంత బిశ్వ శర్మతో కలిసి లోక్ భవన్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడారు. అసోం ఎన్నికల ఫలితాలు ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి విధానాలకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా అభివర్ణించారు. కేంద్ర సంక్షేమ పథకాలను అసోంలో సమర్థవంతంగా అమలు చేసినందుకుగాను హిమంత ప్రభుత్వాన్ని ప్రశంసించారు. వచ్చే ఐదేళ్లలో మోదీ అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెడతారని, వాటిని హిమంత సమర్థంగా అమలు చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో హిమంత మాట్లాడారు. ప్రజలు మరోసారి ఎన్‌డీఏపై విశ్వాసం ఉంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మరింత ఉత్సాహంతో పనిచేస్తామని పేర్కొన్నారు.ఇక, అసోంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి హిమంత బుధవారం రాజీనామా చేశారు. గువాహటిలో లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ లక్ష్మణ్‌ప్రసాద్ ఆచార్యను కలిసి రాజీనామా లేఖను సమర్పించారు. తర్వాత కొద్దినిమిషాలకే హిమంత బిశ్వశర్మ రాజీనామాను గవర్నర్ ఆమోదం తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని హిమంతను, గవర్నర్ కోరారు. అనంతరం హిమంత మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలను ఈసీ అధికారికంగా ప్రకటించిన తర్వాతే రాజీనామా సమర్పించామన్నారు. ప్రస్తుత అసెంబ్లీని రద్దు చేయాలని కూడా గవర్నర్‌ను అభ్యర్థించామని చెప్పారు. అయితే, తన రాజీనామాను గవర్నర్ అంగీకరించారని, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు సీఎంగా కొనసాగాలని ఆదేశించినట్లుగా చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు తాత్కాలిక ప్రభుత్వంగా పనిచేస్తామని హిమంత తెలిపారు.అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఎన్‌డీఏ 102 స్థానాలను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 స్థానాల్లో విజయం సాధించాయి. 2021లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన హిమంత బిశ్వ శర్మ, అసోంలో వరుసగా రెండు సార్లు ముఖ్యమంత్రి అయిన తొలి కాంగ్రెస్‌యేతర నాయకుడిగా గుర్తింపు పొందారు. 2016లో అప్పటి ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ నాయకత్వంలో బీజేపీ కూటమి తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది ఎన్‌డీఏకు వరుసగా మూడో ప్రభుత్వం కానుంది.

## ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మీషన్లు

మొదటిపేజీ తరువాయి..

ప్రకటించింది. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే అంశంపై అధికారులతో సమీక్షనిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది ఇంటర్ ప్రవేశాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండటం కారణంగా విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదని గతంలోనే సర్కారు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది.

# తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



మొదటిపేజీ తరువాయి..

సహజమన్న ప్రధాని మోదీ, పశ్చిమ బెంగాల్‌లో ఓడిపోయింది రాజకీయ పార్టీ కాదని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు ఓడించారని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఇంత ప్రేమ చూపించటం తన అదృష్టమన్నారు. దేశం మొత్తం మార్పును కోరుకుంటోందన్న ప్రధాని, ఏ రాష్ట్రంలోనూ కుటుంబ పాలనను ప్రజలు కోరుకోవట్లేదని పేర్కొన్నారు. ఈసారి తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్,



బీఆర్‌ఎస్ రెండు కూడా కుటుంబ పార్టీలేనని తెలంగాణ అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ కట్టుబడి ఉందన్నారు.తెలంగాణలో జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేసినట్లు మోదీ ప్రకటించారు. దేశం మొత్తానికి 7 పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కులు ఇస్తే, అందులో ఒకటి తెలంగాణకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌తో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, బీజేపీ దృష్టి ఎప్పుడూ అభివృద్ధి, ఉపాధి మీద మాత్రమే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించినందుకు కర్ణాటక ప్రజలు బాధపడుతున్నారని, తెలంగాణలోనూ అలానే ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో, తర్వాత మర్చిపో అన్నట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పొత్తులు ఎప్పుడూ అభివృద్ధి నిరోధకులతోనే ఉంటాయని మండిపడ్డారు.దేశాన్ని ఇప్పటికే నక్సలైట్ల రహితంగా మార్చివేశామన్న మోదీ, తెలంగాణ కూడా నక్సలైట్ల రహితంగా మారిందని ప్రకటించారు. వికసిత్ తెలంగాణ లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందన్నారు.

బంగారం కొనుగోళ్లపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏడాది పాటు జనం బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉంటే మంచిదన్నారు. బంగారం కొనుగోళ్లతో విదేశీ మారక ద్రవ్య నిల్వలు బాగా తగ్గిపోతున్నాయన్నారు. అంతేకాకుండా.. పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలని సూచనలు చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను తెలంగాణ బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇప్పటికే భారీ ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ నగరమంతా కాషాయ తోరణాలు, బీజేపీ ఫ్లెక్సీలు, కటౌట్లతో నింపేసింది. ఈ క్రమంలోనే.. గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ కార్యక్రమం తర్వాత.. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌కు చేరుకోనున్న మోదీకి గెలిచిన సుమారు వంద మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో స్వాగతం పలకనున్నారు. పరేడ్ గ్రౌండ్ సభలో కేంద్రమంత్రులు, బీజేపీ నేతలు మాట్లాడిన తర్వాత.. ప్రధాని మోదీ సుమారు 40నిమిషాలు ప్రజలను, పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, యుద్ధ మేఘాలు దేశంపై చూపుతున్న ప్రభావాన్ని వివరిస్తూనే, సామాన్యుడిపై భారం పడకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన వెల్లడించారు. ప్రస్తుతం ప్రపంచం ఎన్నో సవాళ్లను, సంక్షోభాలను ఎదుర్కొంటోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియా సంక్షోభం, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నదని ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో భారత్ కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితం కాకూడదని, ఈ సంక్షోభాలను అధిగమించి దేశ ప్రయోజనాల కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, భారతీయ రైతులపై ఆ భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో యూరియా ధరలు భారీగా పెరిగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఒక్కో బస్తా యూరియాను సుమారు రూ. 3,000 వెచ్చించి కొనుగోలు చేస్తోంది. ప్రభుత్వం ఇంత భారీ ధరకు కొనుగోలు చేసినా, రైతులకు మాత్రం పాత ధరలకే అందిస్తోంది. ఈ అదనపు భారాన్ని అంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని ప్రధాని మోదీ వివరించారు.యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ప్రపంచవ్యాప్తంగా పెరిగాయని, పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రజలపై భారం పడకుండా గత రెండు నెలలుగా కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ప్రధాని తెలిపారు. “యుద్ధం కారణంగా వచ్చే ఆర్థిక నష్టాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది తప్ప, ధరలను పెంచి సామాన్య ప్రజలపై ఆ భారాన్ని వేయడం లేదు” అని ప్రదాని నరేంద్ర మోదీ వెల్లడించారు. “అంతర్జాతీయ సంక్షోభాల నుంచి భారత్ లాభపడాలి.. ఈ పరిస్థితులను అధిగమించాలి..ఇందుకోసం మన వంతు పాత్ర పోషించాలి.. అప్పుడే మన దేశానికి ప్రయోజనం. ప్రతి భారత పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే, ఈ సంక్షోభం నుంచి బయటపడతాం.. ఇదే సంకల్పం తీసుకుని అందరూ పనిచేయాలని” ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# చెప్పిందే చేస్తా..

మొదటిపేజీ తరువాయి..

విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సీఎంగా ప్రమాణం చేయించారు.
అయితే సీఎంగా ప్రమాణం చేశాక విజయ్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తమిళనాట లౌకిక, సామాజిక, న్యాయశకం మొదలైందని అన్నారు. తాము సాధ్యమయ్యేవే చెబుతామని, చెప్పిందే చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మిత్రులైనా శత్రువులైనా అందరికీ ఒకే చట్టమని స్పష్టం చేశారు. తాను విజయ్ మామ అని, అన్నీ మంచి పనులు చేస్తాడని చెప్పారు.డైరెక్టర్ కుమారుడు నేడు సీఎం అయ్యాడని, తాను అందరివాడినని విజయ్ తెలిపారు. ఎన్నో కష్టాలను అధిగమించి ఈ స్థాయికి వచ్చానని, తనను ఎంతోమంది ఎన్నోరకాలుగా ఇబ్బందిపెట్టారని ఆరోపించారు. కానీ అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. టీవీకేలో ఒకే ఒక అధికార కేంద్రం ఉందని, అది విజయ్ మాత్రమేనని స్పష్టం చేశారు. తమిళనాడులో ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. హామీల అమలుకు కొంత సమయం ఇవ్వండని, డీఎంకే ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని



ఆరోపణలు చేశారు.మహిళలు, యువకులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, మత్స్యకారులు మన టీవీకే ప్రభుత్వంలో అందరూ బాగుంటారు. పుట్టుకతో ప్రతి ఒక్కరూ సమానమే అనేది మన రాజీలేని ప్రాథమిక సిద్ధాంతం. మైనారిటీ సోదరులారా, మన టీవీకే ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుంది. ఇందులో మీకు ఎలాంటి సందేహం అవసరం లేదు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరి ప్రతిరూపమే ఈ విజయ్ ముఖం. మీరు నూరు శాతం ఈ విజయ్‌ను నమ్మవచ్చు. ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన తమిళనాడు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నేను ముఖ్యంగా ఇంకొకరికి కూడా కృతజ్ఞతలు చెప్పాలి వాళ్లే ఈ విజయ్ మామ చిట్టి నేస్తాలు. వాళ్ల వల్లే ఇదంతా సాధ్యమైంది. మీ రుణం ఎలా తీర్చుకోవాలో మీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ విజయ్ మామ మీ కోసం అన్ని మంచి పనులు చేస్తాడు. నమ్మకంతో ఉండండి. రండి, మనమంతా కలిసి ఒక సరికొత్త పరిపాలనను అందిద్దామని అన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం సచివాలయానికి వెళ్లిన విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నూతన సీఎంకు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళనాడు కేబినెట్‌లో ప్రస్తుతం మిత్రపక్షాలకు నేతలకు చోటు దక్కలేదు. మిత్రపక్షాలను సంప్రదించి తర్వాత కేబినెట్ విస్తరణ చేయనున్నట్లు సమాచారం. విజయ్ తల్లిదండ్రులు చంద్రశేఖర్, శోభా చంద్రశేఖర్, ఇతర కుటుంబ సభ్యులు, టీవీకే నాయకులు, మద్దతు ఇచ్చిన పార్టీ నాయకులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. కార్యకర్తలు, సినీ ప్రముఖులు సైతం విజయ్ ప్రమాణ స్వీకారానికి వచ్చారు.ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఆయన పరిపాలన అద్భుతంగా సాగాలని ఆకాంక్షించారు. ప్రజల అభివృద్ధి కోసం అన్ని రకాలుగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుందని అన్నారు. మరోవైపు విజయ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందనలు తెలిపారు. రాష్ట్ర రాజకీయ, సామాజిక చైతన్యాన్ని దీర్ఘకాలంగా నిర్వచిస్తూ వస్తున్న ఆదర్శాలు, పాలనను ముందుకు నడిపిస్తాయని తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్రజలు, ముఖ్యంగా ఆశయాలు కలిగిన యువత, టీవీకేపై తమ నమ్మకాన్ని ఉంచారు. ఆయన నాయకత్వంలో ఆదర్శాలు పాలనను ముందుకు నడిపిస్తూనే, దేశానికి స్ఫూర్తినిస్తాయని నాకు పూర్తి నమ్మకం ఉంది. కరుణ, సమ్మిళితత్వం, అంకితభావంతో ప్రజలకు సేవ చేయడంలో కొత్త ప్రభుత్వం గొప్ప విజయాన్ని సాధించాలని ఆశిస్తున్నాను” అని తెలిపారు.

# అభివృద్ధికి సహకరించండి



మొదటిపేజీ తరువాయి..

తాను తరచూ కలుస్తుంటానని అన్నారు. కొన్ని పనులు అయ్యాయని, ఇంకొన్ని పనులు కావాల్సి ఉన్నాయని మోదీ దృష్టికి తెచ్చారు. తెలంగాణ కూడా మిగిలిన రాష్ట్రాల్లా అభివృద్ధి చెందాలని, తెలంగాణ ప్రాజెక్టులపై మోదీ దృష్టి సారించాలని కోరారు. దేశానికి



10 శాతం జీడీపీ ఇస్తామని వాగ్దానం చేస్తున్నామని, మోదీకి విశాల హృదయం ఉందని కిషన్‌రెడ్డి చెబుతుంటారని, మోజీ తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులకు సహకరిస్తే వేగంగా అభివృద్ధి చెందుతామని అన్నారు.దేశ జనాభాలో తెలంగాణ 3 శాతం వాటా కలిగి ఉందన్న సీఎం, దేశ జీడీపీకి తెలంగాణ 5 శాతం వాటా ఇస్తోందని గుర్తు చేశారు.
2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, 30 ట్రిలియన్ డాలర్లలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల వాటా ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. దేశ జీడీపీకి 10 శాతం వాటా ఇవ్వాలనే లక్ష్యంతో సాగుతున్నామని, దేశాభివృద్ధిలో ఆరు మహానగరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తున్నాయని, దేశానికి సింహభాగం ఆదాయం ఇస్తున్న ఆరు నగరాలను కేంద్రం ప్రోత్సహించాలని ప్రధానిని కోరారు.రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, తెలంగాణ ప్రాజెక్టులపై 2 గంటలు కేటాయించి సమీక్షించాలని మోదీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్, మూసీ ప్రాజెక్టు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ - మచిలీపట్నం వరకూ 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవేకు సహకరించాలని కోరారు. రాష్ట్రాల అభివృద్ధి లేనిదే దేశాభివృద్ధి సాధ్యం కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పదేళ్లుగా గుజరాత్‌కే ఎక్కువ నిధులు ఇచ్చారని రేవంత్ రెడ్డి అంటున్నారని, కేంద్రం పదేళ్లలో గుజరాత్‌కు ఎంత ఇచ్చిందో చెప్పాలని రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నా అంటూ ఛలోక్తులు విసిరారు. దీంతో అందరి ముఖాల్లో నవ్వులు పూశాయి. మూడోసారి ప్రధాని అయ్యాక తొలిసారి తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ హైదరాబాద్ హైటెక్‌సిటీలోని హెచ్ఐసీసీ నుంచి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వర్చువల్‌గా చేశారు. గుజరాత్‌తో సమానంగా తెలంగాణకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మోదీ ప్రకటించారు. సైబరాబాద్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, అనేక పెద్ద ప్రాజెక్టులు ఇక్కడ ప్రాణం పోసుకుంటున్నాయని తెలిపారు. సైబరాబాద్ అతి పెద్ద ఉపాధి కేంద్రంగా మారిందన్న మోదీ, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని గుర్తు చేశారు. వరంగల్ పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కును ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, టెక్స్‌టైల్ రంగంలో వరంగల్ పీఎం మిత్ర పార్కు కీలక పాత్ర పోషిస్తుందని ఆకాంక్షించారు. దీంతో అక్కడ ఉద్యోగావకాశాలు భారీగా వస్తాయని చెప్పారు. ఉమ్మడి ఏపీ కంటే తెలంగాణకు రైల్వే బడ్జెట్ పెంచామని ప్రధాని మోదీ తెలిపారు. హైవేలపై కేంద్రం రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, వాటి అభివృద్ధి ద్వారా తెలంగాణ కూడా లాభపడుతోందని అన్నారు. ఉమ్మడి ఏపీలో రైల్వే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కూడా దక్కేవి కావని గుర్తు చేశారు. ఇప్పుడు ఒక్క తెలంగాణకే రూ.ఐదున్నర వేల కోట్లు కేటాయించామని తెలిపారు. ‘సీఎం రేవంత్‌రెడ్డి గారూ ఇది వింటున్నారా? తెలంగాణ అభివృద్ధికి కేంద్రం భరోసా ఇస్తుంది’ అని ప్రధాని మోదీ ప్రత్యేకంగా చెప్పారు. తెలంగాణ వికసిస్తే దేశం కూడా వికసిస్తుందని అన్నారు. అంతకుముందు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీకి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, అజహరుద్దీన్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి ఘనస్వాగతం పలికారు. మోదీ పర్యటన దృష్ట్యా మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## భూభారతి వచ్చినా అవే సమస్యలు!

### పరిష్కారం కాని భూసమస్యలు

తెలంగాణలో భూ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ స్థానంలో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆశతో భూభారతి వ్యవస్థను ప్రవేశపెట్టింది. భూ రికార్డులను సమూలంగా ప్రక్షాళన చేసి, రైతులకు శాశ్వత పరిష్కారం చూపుతామని చేసిన ప్రకటనలు క్షేత్రస్థాయిలో ఆవిరవుతున్నాయి. భూభారతి అమల్లోకి వచ్చినా సమస్యలు తగ్గకపోగా, సరికొత్త సాంకేతిక, పరిపాలన చిక్కులు తోడై రైతుల పాలిట భూ స్వప్నంగా మారుతోంది. ధరణిలోని లోపాలను సరిదిద్దేందుకు భూభారతిని తీసుకువచ్చినప్పటికీ, దరఖాస్తుల పరిష్కార వేగం మందగించింది. ధరణి కాలం నాటి 2.45 లక్షల పెండింగ్ దరఖాస్తులకు , భూభారతి ప్రారంభమయ్యాక కొత్తగా వచ్చిన దరఖాస్తులు తోడయ్యాయి. ముఖ్యంగా వారసత్వ బదిలీ , భూ విస్తీర్ణంలో వ్యత్యాసాల సవరణకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ మాడ్యూల్స్‌లో సాంకేతిక లోపాలు ఇంకా వెంటాడుతున్నాయి. ప్రభుత్వం కేవలం పోర్టల్ పేరు మార్చడంపై ఉన్న శ్రద్ధ, క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిష్కారంపై చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.భూభారతిలో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన సమగ్ర భూ సర్వే రైతుల్లో కొత్త ఆందోళనలను రేకెత్తిస్తోంది. అత్యాధునిక రోవర్లు, డ్రోన్ల ద్వారా ప్రతి సెంటు భూమిని కొలుస్తామని ప్రభుత్వం చెబుతున్నా, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం రెండు నుండి మూడు ఏళ్లు పట్టే అవకాశం ఉంది. ఈ లోపు పెండింగ్‌లో ఉన్న లక్షలాది సమస్యల పరిస్థితి ఏమిటన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. సర్వే పూర్తయ్యే వరకు రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లలో జాప్యం జరిగితే సామాన్య రైతులకు సాగు పెట్టుబడి కోసం రుణాలు పుట్టడం కూడా గగనంగా మారే ప్రమాదం ఉంది.నిషేధిత భూముల జాబితా (22ఏ) అంశం భూభారతి వచ్చిన తర్వాత మరింత క్లిష్టంగా మారింది. ఎన్నికల సమయంలో ఈ భూములను జాబితా నుండి తొలగిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యేలు, ఇప్పుడు నోరు మెదపడం లేదు. అసైన్డ్, దేవాదాయ భూముల సమస్యలపై ప్రభుత్వం నుండి స్పష్టమైన గైడ్‌లైన్స్ రాకపోవడంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. దీంతో బాధితులు అటు సచివాలయం, ఇటు స్థానిక ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఇచ్చిన హామీలు ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండగా మారాయి. గతంలో కలెక్టర్లకు మాత్రమే ఉన్న అధికారాలను భూభారతి ద్వారా ఆర్డీవోలు, తహశీల్దార్లకు అప్పగించడం అవినీతి కి కొత్త ద్వారాలు తెరిచినట్లయిందని విమర్శలు వస్తున్నాయి. గతంలో కేవలం క్లిక్ ‘తో అయ్యే పనులకు కూడా ఇప్పుడు క్షేత్రస్థాయిలో పైరవీలు చేయాల్సి వస్తోంది. రికార్డుల తారుమారు, ఒకరి భూమిని మరొకరి పేరు మీదకు మార్చడం వంటి ఫిర్యాదులు తహశీల్దార్ కార్యాలయాల్లో వెల్లువెత్తుతున్నాయి. భూముల విలువ భారీగా ఉన్న ప్రాంతాల్లో రాజకీయ నాయకుల జోక్యం పెరిగి, అసలైన రైతులు అన్యాయానికి గురవుతున్నారు.భూభారతి వ్యవస్థ భూ సమస్యలకు పరిష్కారం కాకపోగా, అదనపు భారంగా మారుతోందనేది క్షేత్రస్థాయి వాస్తవం. ప్రజల నుండి వస్తున్న ప్రజావాణి దరఖాస్తుల్లో అత్యధికం భూ వివాదాలే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటనల మోత తగ్గించి, సాంకేతిక లోపాలను యుద్ధప్రతిపాదికన సరిదిద్దాలి. నిరంతరం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు భరోసా కల్పించకపోతే, ఈ అసంతృప్తి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది.

MANAPPURAM HOME FINANCE LTD.
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఇంతకుముందు మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN : U65923K12010PIC039179
రిజిష్టర్డ్ ఆఫీస్: 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి టెంపుల్ దగ్గర, చెర్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ 680567, ఫోన్ నం: 0487-3520504, వెబ్‌సైట్: www.manappuramhomefin.com

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

అయితే, కింద సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) కింద మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (MAHOFIN) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాలు, 2002లోని నిబంధన 9తో సహా సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు మరియు దానిపై వడ్డీ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలను కోరుతూ డిమాండ్ నోటీసు జారీ చేశారు. రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న నిబంధనలలోని *[చట్టం] 9వ నియమంతో చదవబడిన సెక్షన్ 13(4) కింద అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి క్రింద వివరించిన ఆస్తిని సింబాలిక్ స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడుతోంది. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో జరిగే ఏవైనా లావాదేవీలు క్రింద పేర్కొన్న విధంగా సంబంధిత ప్రతి ఆస్తికి మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ఛార్జీకి లోబడి ఉంటాయి:

| క్ర. సం. | రుణగ్రహీత మరియు సహ రుణగ్రహీత పేరు/LAN/ బ్రాంచ్ | ఇంట్రెస్ట్ క్రియేట్ చేయబడిన సెక్యూర్డ్ అసెట్‌కు సంబంధించి వివరణ | డిమాండ్ నోటీసు పంపిన తేదీ & బకాయి మొత్తం | స్వాధీనం తేదీ |
|---|---|---|---|---|
| 1 | బొగ్గుల శ్రీదేవి, బొగ్గుల సురేష్, /MHL00720033039/ వరంగల్ | కాళేశ్వరం రెవెన్యూ గ్రామం & గ్రామపంచాయతీ, మహదేవ్‌పూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, తెలంగాణ, పిన్: 505503 వద్ద ఇంటి నం. 6-37/ఎలోని ఎ.సి.సి. షీట్ రూఫ్‌తో కూడిన ఇంటితో కూడిన ఓపెన్ ప్లేస్ ఆస్తి. తూర్పు- జిపి రోడ్డు, పడమర: గుర్రపు కార్తీక్ ఇల్లు, దక్షిణం: తాళ్లపల్లి ముక్తేశ్వర ఇల్లు, ఉత్తరం- పిట్టల గంగన్న ఓపెన్ ప్లేస్ | 03-02-2026 & రూ. 500490/- | 07-05-2026 |

తేది: 11 మే 2026 | ప్రదేశం: తెలంగాణ
సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

MANAPPURAM HOME FINANCE LTD.
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఇంతకుముందు మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN : U65923K12010PIC039179
రిజిష్టర్డ్ ఆఫీస్: 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి టెంపుల్ దగ్గర, చెర్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ 680567, ఫోన్ నం: 0487-3520504, వెబ్‌సైట్: www.manappuramhomefin.com

డిమాండ్ నోటీసు

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, 8/596 ఎ, పద్మప్రభ బిల్డింగ్, శ్రీరామ స్వామి టెంపుల్ దగ్గర, చెర్పు-త్రిప్రయార్ రోడ్, త్రిప్రయార్, త్రిస్సూర్, కేరళ 680567 (ఇకపై “MAHOFIN” సూచించబడతాయి) కంపెనీల చట్టం, 1956 క్రింద నమోదు చేయబడిన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (ఇకపై చట్టంగా సూచిస్తారు) సెక్షన్ 2లోని సబ్-సెక్షన్ (1) యొక్క క్లాజ్ (ఎ) యొక్క సబ్-క్లాజ్ (ఐఐ) ప్రకారం ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్. నోటిఫికేషన్ నంబర్ S.O 3466 (E) తేదీ 18 డిసెంబర్, 2015 భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ జారీ చేసిన ప్రకారం నిర్మాణం కోసం రుణాలను అడ్వాన్సింగ్ చేసే వ్యాపారాన్ని మరియు / లేదా నివాస గృహాల కొనుగోలు నిర్వహిస్తోంది మరియు దిగువ పేర్కొన్న చార్ట్‌లోని కాలమ్ నం. 2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ-రుణగ్రహీతలు MAHOFIN నుండి రుణం పొందారు మరియు MAHOFN సెక్యూర్డ్ క్రెడిటార్ అయినందున SARFAESI చట్టం ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 2తో చదవబడిన ఈ చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద అందించబడిన అధికారాలను ఉపయోగించడం ద్వారా ఈ క్రింద పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలను పిలుస్తూ, నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని తదుపరి వడ్డీతో నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు తిరిగి చెల్లించమని డిమాండ్ నోటీసు జారీ చేయడం జరిగింది. కానీ వివిధ కారణాల వల్ల వారిలో కొందరికి నోటీసులు అందజేయబడలేదు. దానితో పాటు క్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం యొక్క ప్రయోజనాల కోసం, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా చెప్పబడిన రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

| క్ర. సం | రుణగ్రహీత మరియు సహ రుణగ్రహీత పేరు/LAN/ బ్రాంచ్ | ఇంట్రెస్ట్ క్రియేట్ చేయబడిన సెక్యూర్డ్ అసెట్‌కు సంబంధించి వివరణ | NPA తేదీ | నోటీసు పంపిన తేదీ & బకాయి మొత్తం |
|---|---|---|---|---|
| 1. | సింగారపు పద్మ, సింగారపు కల్పన, సింగారపు విల్సన్, /MHL00720033643/ వరంగల్ | శివనగర్, వరంగల్ నగరం & మున్సిపాలిటీ, ఫోర్ట్ వరంగల్ మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ, పిన్: 506002 ఇంటి నెం. 16-10-142/1 కలిగిన, 88.00 చదరపు గజాలు లేదా 73.57 చదరపు మీటర్లు విస్తీర్ణంలో ఉన్న, 246.00 చదరపు అడుగుల RCC పైకప్పు ప్లింత్ వైశాల్యం మరియు 136.00 చదరపు అడుగుల AC షీట్ ప్లింత్ వైశాల్యం కలిగిన, ఖాళీ స్థలంతో కూడిన RCC ఇల్లు; సరిహద్దులు: తూర్పు - 10 అడుగుల వెడల్పు గల రహదారి, పడమర - 80 అడుగుల వెడల్పు గల రహదారి, దక్షిణం - S. రాజేశ్వరి గారి ఇంటి నెం. 16-10-142, ఉత్తరం - Ch. సుజాత గారి ఇంటి నెం. 16-10-143. | 12-04-2026 | 17-04-2026 & రూ. 502563/- |

అందువల్ల, పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలకు ఈ నోటీసు ప్రచురించబడిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత / సహ-రుణగ్రహీతకు సంబంధించి, పైన చూపిన విధంగా బకాయి మొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని కోరడం జరుగుతుంది.సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ అమలు చేయడం కోసం u/s 13(4)ని MAHOFIN పైన వివరించిన ఆస్తులపై చర్యలు తీసుకోవలసి ఉంటుంది. కింద సూచించిన విధంగా ఇతర పద్ధతులలో నోటీసు సేవ కోసం కూడా తదుపరి చర్యలు తీసుకోబడుతున్నాయి. SARFAESI చట్టంలోని సెక్షన్ 13(8)లో పబ్లిక్ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ చేయడానికి నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా MAHOFIN ద్వారా అయ్యే ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి.
SARFAESI చట్టం యొక్క S- 13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డ్ ప్రాపర్టీలను ఏ పద్ధతిలోనైనా అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో బదిలీ చేయకుండా మరియు/లేదా వ్యవహరించకుండా నిరోధించబడ్డారని గుర్తుంచుకోండి.

తేది: 11 మే 2026 | ప్రదేశం: తెలంగాణ
సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

## వేసవి సెలవులలో పిల్లల పట్ల జాగ్రత్తగా వహించండి

– దుగ్గొండి సీఐ సాయి రమణ



**నర్సంపేట మే10 (సాక్ష్యం న్యూస్ ):** వేసవికాలంలో స్కూల్ సెలవుల కారణంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించడం మంచిదని దుగ్గొండి సర్కిల్ ఇన్స్పెక్టర్ సాయి రమణ తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ముఖ్యంగా యువత మరియు కౌమార దశ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. వేసవి తాపానికి పిల్లలు చెరువుల వద్దకు, బావుల వద్దకు ఈతకు వెళ్లడం సరదాగా భావించి వెళ్లడం ద్వారా అక్కడ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, వాటి గురించి తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలన్నారు. పిల్లలు సరదాగా బైక్ డ్రైవింగ్ మోజుపడటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ అని, మైనర్లకు బైక్ డ్రైవింగ్ చేస్తూ పోలీసులు కంటపడితే బండి యజమాని మీద కేసు నమోదు అవుతుందని తెలిపారు. వేసవికాలంలో సరదాగా ఆట స్థలాల వద్ద యువత ఆడుకోవడానికి ఎక్కువ ఇష్టపడుతుంటారు. ఆ ప్రదేశాలలో ఆకతాయిలు మీ పిల్లలకు మద్యపానం, ధూమపానం, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చే ప్రమాదం ఉంటుందని ,పిల్లలు ఎటూ వెలుతున్నారు. ఎం చేస్తున్నారో జాగ్రత్తగా గమనించాలని కోరారు. వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడ దెబ్బకు గురికాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.

## విద్యతో సమ్మర్ క్యాంప్‌కు శ్రీకారం

– ప్రధానోపాధ్యాయులు పొడెం కాంతారావు



**నర్సంపేట మే 10 (సాక్ష్యం న్యూస్ ) :** ప్రతి విద్యార్థి మేథస్సే దేశ భవిష్యత్తుకు పునాది అని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొడెం కాంతారావు అన్నారు. నర్సంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికల)లో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు "విద్యతో సమ్మర్ క్యాంప్" కార్యక్రమాన్ని ఈ నెల 11 నుండి 25 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో నర్సంపేట పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అలా 15 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం ఈ క్యాంప్ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యాపరమైన అంశాలతో పాటు నాట్యం, డ్రాయింగ్, రోల్ ప్లే,కమ్యూనికేషన్ స్కిల్స్, ఇండోర్ గేమ్స్ వంటి విద్యేతర అంశాల్లో కూడా శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. క్యాంప్‌కు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం కూడా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్యాంప్‌కు పంపించి వారిమంచి భవిష్యత్తుకు సహకరించాలని కోరారు. విద్యావేత్తలు, సామాజిక వేత్తలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుక నియామకంపై ఘన సంబరాలు






**సికింద్రాబాద్, మే 10 (సాక్ష్యం)...** తెలంగాణ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుకను రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీతాఫల్‌మండి డివిజన్ మాణిక్యేశ్వరి నగర్ కమాన్ వద్ద వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ డిసిసి ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి సికింద్రాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆధం సంతోష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. డిసిసి ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వడ్డెరలను కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకున్నారని, వారి సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే వడ్డెర కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో చూపించే ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ బోదాసు నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్, గణేష్, బొంతు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జింఖానా గ్రౌండ్‌లో ప్రధాని మోదీ సభకు తరలి వెళ్లిన బీజేపీ శ్రేణులు


– మల్లెల నర్సింగరావు ఆధ్వర్యంలో బస్సుల్లో బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు



**ఉప్పల్, మే 10 (సాక్ష్యం):** సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ సభకు నాచారం ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగరావు ఆధ్వర్యంలో హెచ్ఎంటి నగర్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి కార్యకర్తలను సభకు పంపించారు. ఈ సందర్భంగా మల్లెల నర్సింగరావు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ప్రధాని మోదీ నాయకత్వం దేశాన్ని ముందుకు తీసుకెళ్తోందన్నారు. తెలంగాణలో కూడా బీజేపీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి బీజేపీ ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సభ విజయవంతం కావడానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సభకు వెళ్లిన కార్యకర్తల్లో ఉత్సాహం, జోష్ కనిపించిందన్నారు. "మోదీ... మోదీ" నినాదాలతో ప్రాంతం మార్మోగిపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్, బీజేపీ నాయకులు అభిషేక్ గౌడ్, ప్రకాష్, వెంకటేష్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి దేశమా...? మన భారతదేశమా...?

– 11 ఏళ్ల ఎన్డీయే పాలనలో జనాభా ఎక్కువ, ప్రగతి తక్కువ..!






కంచర్ల నాగేశ్వరరావు గౌడ్ ,
సామాజిక రాజకీయ విశ్లేషకులు,
సెల్ నెంబర్ : 7386805364

**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం** 13.7% జనాభాకి తిండి లేదు. 35.5% పిల్లలు ఎదుగుదల లోపం. జనాభా ఎం ప్రగతి -- ఇతర దేశాలతో పోలిస్తే..భారతదేశ జనాభా 148 కోట్లు,చైనా 140 కోట్లు. ఇద్దరి జనాభా దాదాపు సమానం. కానీ తలసరి ఆదాయం తేడా చూడండి. 2024లో భారత తలసరి ఆదాయం $2,695. చైనా తలసరి ఆదాయం $13,314. అంటే చైనా పౌరుడు భారత పౌరుడి కంటే 5 రెట్లు ఎక్కువ సంపాదిస్తున్నాడు. 1984లో ఇద్దరి తలసరి ఆదాయం సమానంగా $471,$480 ఉండేది. 2024కి చైనా 5 రెట్లు ముందుకు వెళ్లింది,మనం అక్కడే ఉన్నాం.

**చిన్న దేశాలతో పోలిస్తే కూడా వెనుకబడ్డాం..**

బంగ్లాదేశ్ తలసరి ఆదాయం $2,911, వియత్నాం $5,115, ఇండోనేషియా $5,362. భారత్ $2,813 మాత్రమే. జనాభా మనకంటే చాలా తక్కువ ఉన్న శ్రీలంక $4,516, భూటాన్ $4,867. ప్రపంచ ర్యాంకు జిడిపి పరంగా భారత్ 5వ స్థానం. కానీ తలసరి ఆదాయంలో 143వ స్థానం. 197 దేశాల్లో మనం 172వ స్థానంలో ఉన్నాం.

**11 ఏళ్లలో సామాన్యుడి బతుకు -- అధికారిక లెక్కలు..నిరుద్యోగం..!**

2014లో నిరుద్యోగ రేటు 5.41%. 2024లో 6.70%. 2023లో 8.40% కి వెళ్లింది. అంటే 11 ఏళ్లలో ఉద్యోగాలు పెరగలేదు,తగ్గాయి.

మహిళా నిరుద్యోగం 2024 జూన్‌లో 18.5%. జాతీయ సగటు కంటే 3 రెట్లు ఎక్కువ.

**ఆకలి సూచిక..?**

Global Hunger Index 2024లో భారత్ 127 దేశాల్లో 105వ స్థానం. స్కోర్ 27.3 -- సీరియస్ కేటగిరీ. 13.7% జనాభాకి తిండి లేదు. 35.5% పిల్లలు ఎదుగుదల లోపంతో,18.7% పిల్లలు బరువు తక్కువతో బాధపడుతున్నారు. ప్రపంచంలోనే అత్యధిక చైల్డ్ వేస్టింగ్ రేటు మనదే. నేపాల్ 68,శ్రీలంక 56,బంగ్లాదేశ్ 84 స్థానాల్లో ఉన్నాయి. పాకిస్తాన్ 109,అఫ్ఘానిస్తాన్ 116 మాత్రమే మనకంటే వెనుక.

**అసమానత లో..?**

టాప్ 1% దేశ సంపదలో 40.1% కలిగి ఉన్నారు. ఇది 1961 తర్వాత అత్యధికం. దిగువ 50% దగ్గర కేవలం 3% సంపద ఉంది. టాప్ 10% జాతీయ ఆదాయంలో 58% తీసుకుంటున్నారు. దిగువ 50%కి 15% మాత్రమే. "బ్రిటిష్ రాజ్ కంటే ఇప్పటి బిలియనీర్ రాజ్‌లో అసమానత ఎక్కువ" అని World Inequality Lab తేల్చింది.

**అవినీతి – దేశ అభివృద్ధికి అడ్డుగోడ..?**

Transparency International 2024 నివేదిక ఆధారంగా..భారత్ 180 దేశాల్లో 96వ స్థానం. స్కోర్ 38/100. 2023లో 39,2022లో 40. స్కోర్ తగ్గుతోంది,అంటే అవినీతి పెరుగుతోంది. డెన్మార్క్ 90 స్కోర్‌తో 1వ స్థానం. చైనా 76వ స్థానం. పాకిస్తాన్ 135,బంగ్లాదేశ్ 149. చీజ=దీ 2024 డేటా ఆధారంగా చూస్తే..మహారాష్ట్ర 11వ ఏడాది వరుసగా అవినీతి కేసుల్లో 1వ స్థానం. 2024లో 721 కేసులు. 2014లో 1,316 కేసులు. జూ× స్కోర్ చరిత్ర 2013లో 36 ఉంటే 2025లో 39 అయింది. అంటే 12 ఏళ్లలో 3 పాయింట్లు మాత్రమే మెరుగుదల కనిపిస్తుంది.

**ఎన్నికలకు – కులం,మతం,ఈవీఎంలతో..?**

2014 నుండి బిజెపీ 3 సార్లు కేంద్రంలో గెలిచింది. ప్రతి ఎన్నికకు ముందు కుల,మత అంశాలు ప్రధాన ప్రచార అస్త్రాలుగా మారుతున్నాయని ప్రతిపక్షాలు,రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈవీఎం ల వాడకం 2004 నుండి దేశవ్యాప్తంగా ఉంది. ప్రతిపక్షాలు ఈవీఎం ల పై అనుమానాలు లేవనెత్తుతున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం ఈవీఎం లు ట్యాంపర్ ప్రూఫ్ అని చెబుతోంది.

**మోదీ పాలన 11 ఏళ్లలో లాభపడింది ఎవరు**

**అధికారిక లెక్కల ప్రకారం..**

బిలియనీర్లు 1991లో 1 బిలియనీర్ ఉంటే, 2022కి 162 అయ్యారు. వీరి సంపద వాటా చరిత్రలోనే గరిష్టం 40.1%. గా పెరిగింది మోదీ దయతోనే...అలాగే కార్పొరేట్ రంగం లోను 2024-25లో ఝాల ద్వారా 1,62,387 కోట్లు సమీకరించారు. ఖీణ× 2000-2024 మధ్య $1.05 ట్రిలియన్ వచ్చింది. టాప్ 10% దేశ ఆదాయంలో 58%,సంపదలో 65% వీరిదే మోదీ భక్తులదే పైచేయి గా ఉంది.

**భారతదేశంలో నష్టపోయింది ఎవరు..?**

దిగువ 50% జనాభా. వీరి ఆదాయ వాటా 15%,సంపద వాటా 6.4%. ఆకలి సూచికలో 105వ స్థానం,నిరుద్యోగం 6.7శాతం సిగ్గుచేటు..

**ముగింపు – జనాభా సాకు కాదు..**

చైనా జనాభా మనతో సమానం. కానీ తలసరి ఆదాయం 5 రెట్లు ఎక్కువ,అవినీతి సూచికలో 76వ స్థానం,భారతీయులైన మన స్థానం96దిగజారిపోయింది. బంగ్లాదేశ్,వియత్నాం జనాభా తక్కువ,తలసరి ఆదాయం మనకంటే ఎక్కువ. ఆకలి సూచికలో మనకంటే 20-40 స్థానాలు ముందు.

సమస్య జనాభా కాదు. సమస్య పంపిణీలో ఉంది, అవినీతిలో ఉంది. 11 ఏళ్లలో +ఖా 3 రెట్లు పెరిగింది. కానీ ఆ పెరుగుదల దిగువ 50%కి చేరలేదు. టాప్ 1%కి చేరింది.

అవినీతి సూచిక 38 పాయింట్లతో ప్రపంచ సగటు 43 కంటే దిగువన ఉంది. దీన్ని తగ్గించకుండా,సంపదను పంపిణీ చేయకుండా,కుల మతాల పేరుతో ఓట్లు అడిగినంత కాలం సామాన్యుడి బతుకు మారదు..!

## సూపర్ సిక్స్ అమలులో లోపకారి మోసాలు

– కాంగ్రెస్ సెక్రటరీ మరియమ్మ



**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం** ప్రస్తుతం అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాల్లో ఎన్డీయే ప్రభుత్వం లోపకారి మోసాలకు పాల్పడుతోందని ప్రకాశంజిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీ పి.మరియమ్మ ఆరోపించారు. ఆదివారం ఒంగోలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సాక్ష్యం దినపత్రిక కు ఇచ్చిన ప్రెస్‌మీట్‌లో ఆమె ఉదాహరణలతో సహా ఎన్డీఏ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను బట్టబయలు చేశారు.

**మహిళల ఉచిత బస్సు ప్రయాణం – బస్సు మార్చి బురిడీ..**

ఎన్నికల ప్రచారంలో మ్యానిఫెస్టోలో ఎక్కడా ఇటువంటి బస్సులలోనే మహిళలు ఉచితం అని చెప్పలేదు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ అనే చెప్పారు. అమలులో మోసం ఎలాంటే..!ఇప్పుడు పల్లె వెలుగు,ఎక్స్‌ప్రెస్,డీలక్స్ బస్సుల్లో మాత్రమే ఉచితం అంటున్నారు. ఒంగోలు నుండి హైదరాబాద్ వెళ్లే సూపర్ లగ్జరీ,ఇంద్ర ఏ.సి.బస్సుల్లో మహిళలు టికెట్ కొనాల్సిందే. పేద మహిళ 8 గంటలు ప్రయాణించాలంటే ఆర్డినరీ బస్సులో మగ్గాలా..?ఉచితం అని చెప్పి గ్రామాలకు వెళ్లే పల్లె వెలుగు సర్వీసులే తగ్గించేశారు. కందుకూరు-పొదిలి రూట్లో రోజుకు 6 బస్సులు తిరిగేవి. ఇప్పుడు 2 మాత్రమే. మహిళలు 3 గంటలు బస్టాండ్‌లో పడిగాపులు..

**అన్నదాత సుఖీభవ – లెక్క తప్పిన లెక్క..?**

**ఏటా రూ.20 వేలు ఖాతాలో వేస్తాం**

ఇప్పటివరకు ఇచ్చింది ఒక్క విడత రూ.5 వేలు మాత్రమే. అది కూడా భూమి ఉన్న రైతులకే. ఉదాహరణ కు..యర్రగొండపాలెం మండలంలో 1200 మంది కౌలు రైతులు ఉంటే ఒక్కరికీ పైసా రాలేదు. వీళ్లు పండించే పంట ప్రభుత్వానికి కనిపించదా..?కేంద్రం ఇచ్చే ప్రధానమంత్రి-కిసాన్ రూ.6 వేలు కలిపి రూ.20 వేలు అంటున్నారు. అది ముందు నుండే వస్తోంది. రాష్ట్రం కొత్తగా ఇచ్చింది రూ.5 వేలు మాత్రమే..!

**మెగా డీఎస్సీ నోటిఫికేషన్ డ్రామా..?**

16,347 టీచర్ పోస్టులు భర్తీ చేస్తామన్నాని..యువతకు ఉద్యోగాల మంట పెట్టారు. 2024 జూలైలో నోటిఫికేషన్ ఇచ్చారు. పరీక్ష పెట్టారు. 10 నెలలు అయినా ఒక్కరికీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. 5.2 లక్షల మంది అభ్యర్థులు కోచింగ్‌లకు లక్షలు తగలేసి రోడ్డున పడ్డారు. రోస్టర్,కోర్టు కేసులు అని సాకులు. కావాలనే ఆలస్యం చేస్తున్నారు. జీతాలు ఇవ్వలేక భర్తీ ఆపేశారని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి.

**ఆడబిడ్డ నిధి-దరఖాస్తు దగా..?**

18-59 ఏళ్ల ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామడంతో ప్రతి గ్రామంలో గ్రామ సభలు పెట్టి దరఖాస్తులు తీసుకున్నారు. ఉదాహరణ కు ప్రకాశం జిల్లాలో 4.8 లక్షల మంది అప్లై చేసుకుంటే,ఒక్కరి ఖాతాలో కూడా రూపాయి పడలేదు. వెబ్‌సైట్‌లో ప్రాసెసింగ్ అనే చూపిస్తోంది 8 నెలలుగా...ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులే కేటాయించలేదు. కేవలం ఓట్ల కోసం ఆడబిడ్డలను వాడుకున్నారు.

**దీపం-2 సబ్సిడీ సతాయింపు..!**

ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం అన్నారు. ఇప్పుడు ఇప్పుడు ముందు రూ.1200 కట్టి సిలిండర్ తెచ్చుకోవాలి. తర్వాత సబ్సిడీ వస్తుందంట. ఉదాహరణ కు మార్కాపురంలో లక్ష్మమ్మ అనే కూలీ మహిళ ఫిబ్రవరిలో సిలిండర్ తీసుకుంటే,మే నెల వచ్చినా సబ్సిడీ రాలేదు. అప్పు చేసి గ్యాస్ కొనలేక మళ్లీ కట్టెల పొయ్యే దిక్కు. సిలిండర్ కనెక్షన్ భర్త పేరు మీద ఉంటే ఇవ్వం అంటున్నారు. ఆ నిబంధన మ్యానిఫెస్టోలో ఉందా..?

**యువగళం నిధి-యువతకు టోకరా..?**

నిరుద్యోగులకు నెలకు రూ.3000/-అమలైన ఊసే లేదు..?ఈ పథకం అటకెక్కింది. వెబ్‌సైట్ లేదు,+ూ లేదు,దరఖాస్తు లేదు. ఒంగోలులో డిగ్రీ పూర్తి చేసిన రమేష్ 2 ఏళ్లుగా ఉద్యోగం లేక ఎదురుచూస్తున్నాడు. ఎప్పుడు ఇస్తారు సార్..?అని అడిగితే అధికారుల దగ్గర సమాధానం లేదు. మరియమ్మ ఫైర్ ఇది సూపర్ సిక్స్ కాదు,సూపర్ స్కామ్ సిక్స్ పేరుకే హామీలు,అమలులో మాత్రం తూట్లు. ప్రతి పథకంలో షరతులు పెట్టి,లబ్ధిదారులను కోత కోసి,ఉన్నది కూడా ఇవ్వకుండా లోపకారి పాలన చేస్తున్నారు. ప్రజలు 2024లో నమ్మారు,కానీ 2029లో నమ్మరన్నారు.

**కాంగ్రెస్ అల్టిమేటం :-**

15 రోజుల్లో అన్ని హామీలను షరతులు లేకుండా అమలు చేయాలి. లేకపోతే జూన్ 1 నుండి పోలింగ్ బూత్ స్థాయి హామీల పోరాటం మొదలుపెడతాం. ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్డీయే మోసం బయటపెడతాం. ప్రెస్‌మీట్‌లో జిల్లా కాంగ్రెస్ మహిళా నాయకులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల మక్కల కొనుగోళ్లలో చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

– ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్



**నర్సంపేట, మే 10 (సాక్ష్యం న్యూస్ ) :** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్నలను మద్దతు ధరతో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. తక్షణమే బేషరతుగా రైతుల మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఆయన రైతుల సమస్యలు, కొనుగోళ్ల పరిస్థితిని పరిశీలించారు. జిల్లాలో లక్షకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగి భారీ దిగుబడి వస్తుందని ముందే అంచనా ఉన్నప్పటికీ, సరిపడా కొనుగోలు కేంద్రాలు, గోదాములు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోళ్లలో జాప్యం చేసి ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు లాభం చేకూరుస్తున్నారని ఆరోపించారు. నెల రోజులుగా రైతులు మార్కెట్‌లోనే బస్తాలతో పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. అకాల వర్షాలతో ఇప్పటికే కొన్ని చోట్ల మొక్కజొన్న తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టి రైతులకు మద్దతు ధర కల్పించాలని, లేకపోతే రైతులకు జరిగే నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబా బాబురావు, ఎంసీపీఐ(యు) నాయకుడు మహమ్మద్ రాజా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# నియామక పత్రం లేకుండా ప్రైవేటు వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగ రాజా భోగాలు





**హైదరాబాద్ మే10 (సాక్ష్యం న్యూస్ ):** గత నాలుగు సంవత్సరాలుగా 2022 నుండి నేటి వరకు ఎటువంటి అపాయింట్ మెంట్ నియామక పత్రం లేకుండా జిల్లా పంచాయతీ కార్యాలయంలో నలుగురు జిల్లా అధికారులు మారిన ముగ్గురు జిల్లా కలెక్టర్లు మారినా బిందాస్ నేనింతే.! ఐ డోంట్ కేర్.! ఇదిలా ఉండగా ఎటువంటి ప్రభుత్వ అధికారిక నియామక పత్రాలు లేకున్నా తానే జిల్లా ఆఫీసులో బాస్ గా రాణిస్తున్న ఇతనే ఆ మొనగాడు .! సాక్షాత్తు జిల్లా కలెక్టర్ సమీకృత కార్యాలయంలో గల జిల్లా పంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వ మరియు కాంట్రాక్టు పద్ధతి ద్వారా నైనా లేక జిల్లా కలెక్టర్ నుండి ఐనా ఎటువంటి నియామక అనుమతి పత్రం లేకుండా విధులను నిర్వర్తించడం అధికారులకు సిగ్గుచేటు.!నేటికీ జిల్లా సమీకృత కార్యాలయంలోని జిల్లా పంచాయతీ కార్యాలయంలో గత నాలుగు సంవత్సరాలుగా అధికార అనుమతి నియామక ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా లక్షల రూపాయలు ప్రభుత్వ,ప్రజల ఖజానా సొమ్మును కాజేస్తున్న ఆ కంప్యూటర్ ఆపరేటర్ పై జిల్లా ఉన్నతాధికారుల నిఘా ఏది, దొరల సొమ్ము దొంగల పాలు అన్నట్టు ఉంది మన జిల్లా అధికారుల తీరు.!వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో గల జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఎటువంటి అనుమతి నియామక పత్రం లేకుండా పనిచేస్తున్న ప్రైవేట్ (పర్సనల్) కంప్యూటర్ ఆపరేటర్ పై ప్రత్యేక కథనం అందిస్తున్న ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ కొప్పుల శ్రీనివాస్.ఎన్నో నిద్ర హారాలు మాని కోచింగ్ సెంటర్లలో,గ్రంథాలయాల్లో, స్టడీ సర్కిల్ సెంటర్లలో, పుస్తకాలతో కుస్తిపట్టి పగలు,రేత్రి అని తేడా లేకుండా ఎంతో కష్టపడి చదివితే గాని ప్రభుత్వ ఉద్యోగం రావడం చాలా కష్టతరం. కానీ ఒక వేళ ఉద్యోగం వస్తె ఆ ఎంక్వైరీ,ఈ ఎంక్వైరీ అంటూ ఇంటలిజెన్స్, పోలీస్ నిఘా వర్గాలు కంటిమీద నిద్ర లేకుండా ఎంక్వైరీ ల మీద ఎంక్వైరీ లు చేస్తే గానీ సాధారణంగా ఉద్యోగం రాదు, కానీ ఈ వ్యక్తికి అవేమి లేకుండానే గార్ల మండలంలో అప్పట్లో మొదటగా ఎంపీ ఓ పనిచేస్తున్న అధికారిని,ఆ సమయ కాలంలో ప్రసూతి సెలవులో వెళ్ళగా అదే మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శిని ఇంచార్జ్ ఎంపీ ఓ గా నియమించగా, ఆ సమయంలో సెలవులో వెళ్లిన అధికారి యొక్క విశిష్ట అధికారాన్ని దుర్వినియోగ పరిచి,అదే అదునుగా భావించి అక్రమంగా ఇటు జిల్లా అధికారీ నుండి గానీ లేదా జిల్లా కలెక్టర్, లేదా ఆ శాఖ ముఖ్య కమిషనర్ నుండి గానీ ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రికా ప్రకటన/ప్రచురణార్థం సమాచారం లేకుండానే కొంతమంది ప్రభుత్వ అధికారుల అండ దండలతో జిల్లా పంచాయతీ కార్యాలయానికి అనుమతి లేకుండా అక్రమ నియామకమే ఈ ఉద్యోగి నిదర్శనం. ఉదాహరణకు గ్రామపంచాయతీ సిబ్బంది మొదలు పంచాయతీ కార్యదర్శి మండల అధికారులు జిల్లా స్థాయి మాకు ఎటువంటి వారినైనా ఆ కంప్యూటర్ ఆపరేటర్ తన మాటలతో మంత్ర ముగ్ధులు కావాల్సిందే, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అంత అనధికృత ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్ దే హవా.నిన్నటికి,మొన్నటికి మొన్న జూనియర్ పంచాయతీ సెక్రెటరీ లు (జీూా) తమ తమ యూనియన్ నాయకులతో సెటిల్మెంట్ మాట్లాడుకొని రెగ్యులరైజేషన్ చేసినట్లు,ఇప్పటికీ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా,చంటి పిల్లలతో కార్యాలయం చుట్టూ పలు పంచాయతీ బాధిత సెక్రటరీలు రోధిస్తున్న రోదన వర్ణనాతీతం, ఇతని టార్చర్ భరించలేక మరి కొంతమంది భయపడి ఇంకా పర్మినెంట్ కాలేకపోయారు.ఇంత జరుగుతున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ,లోకల్ బాడీస్ జిల్లా కలెక్టర్ అతనిపై చర్యలు తీసుకోకపోవడం పై పలు విమర్శలు చేస్తున్నట్లుగా ఉద్యోగులు, రాజకీయ నాయకులు, విశ్లేషకులు, జర్నలిస్టులు, మేధావులు, పలు రాజకీయ పార్టీల నాయకులు చర్చించుకోవడం గమన హారం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర చీఫ్ సెక్రటరీలు, స్పందించి ఇటువంటి నకిలీ ఉద్యోగులపై నజర్ పెట్టినా కూడా ఇలాంటి దుర్మార్గులను గుర్తించకపోవడం ప్రభుత్వం వైఫల్యంగా భావిస్తున్న జిల్లా ప్రజలు ఇంత జరుగుతున్న ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే...!

# తెలంగాణకు కేంద్రం అన్యాయం చేస్తోంది

– కూరెల్లి నాగరాజు గౌడ్



**సికింద్రాబాద్, మే 10 (సాక్ష్యం)** ...తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోడీ నిధులు ఎంత ఇచ్చారనే విషయంపై బీజేపీ నాయకులు కేంద్ర మంత్రులు, ఎంపీ లు ఎమ్మెల్యే లు తెలంగాణ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ యువజన విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెల్లి నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. లాలాపేటలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణకి ఏమి చేశాడని ఆదివారం హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారని ఆరోపించారు. ఇది వరకు ఇదే పరేడ్ గ్రౌండ్లో సభ పెట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ మళ్ళీ ఇప్పుడు బహిరంగ సభ ఏర్పాటు చేసి ఊక దంపుడు ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప తెలంగాణకు చేసేది ఏమి లేదని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తామని ఆశపడుతున్న ప్రధానికి ఇంకో 100 సంవత్సరాలు అయినా నరేంద్ర మోదీ కోరిక నెరవేరదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా తెలంగాణ పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. పక్క రాష్ట్రాలకు భారీగా నిధులు కేటాయిస్తూ తెలంగాణ అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గుజరాత్ రాష్ట్రంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న కేంద్రం, తెలంగాణకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందించిన నిధులపై బీజేపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# తృటిలో తప్పిన ప్రాణాపాయం

- తెగిపడ్డ 11 కేవీ విద్యుత్ వైర్లు
- మొక్కజొన్న చేలో మంటలు
- కళ్లముందే బూడిదైన పంట
- లబోదిబోమంటున్న బాధితుడ
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ సాక్ష్యం మే 10)** కొత్తగూడ మండలంలో గాలి బీభత్సం సృష్టించింది. ప్రకృతి ప్రకోపానికి నిరుపేద రైతుకు భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. కొత్తపల్లి – పొగుళ్లపల్లి గ్రామాల మధ్య ఈదురు గాలుల ధాటికి హైటెన్షన్ విద్యుత్ వైర్లు తెగిపడి, చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతైంది.11 కేవీ విద్యుత్ వైర్లు గాలి ధాటికి తెగి కింద పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి, పక్కనే ఉన్న బోడ రాజన్న అనే రైతుకు చెందిన మొక్కజొన్న చేలో మంటలు చెలరేగాయి. ఎండ తీవ్రతకు ఎండిపోయిన ఆకులు, దానికి తోడు గాలులు తోడవడంతో మంటలు క్షణాల్లో తోటంతా వ్యాపించాయి. సుమారు ఒక ఎకరం విస్తీర్ణంలో ఉన్న మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. కళ్లముందే పంట తగలబడుతుండటంతో రైతు రాజన్న మరియు గ్రామస్థులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

**రైతు ఆవేదన**

రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పంట, కోతకు వచ్చే సమయంలో ఇలా అగ్నిపాలవ్వడంతో రైతు రాజన్న కన్నీరుమున్నీరవుతున్నారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టానని, ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### తార్నాక డివిజన్ నుంచి ప్రధాని మోదీ

# సభకు భారీగా తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు




**సికింద్రాబాద్, మే 10 (సాక్ష్యం):** సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు తార్నాక డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని వినేందుకు యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ప్రధాని మోదీ నాయకత్వం దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందన్నారు. తెలంగాణలో బీజేపీకి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతుందని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. “మోదీ... మోదీ” నినాదాలతో తార్నాక ప్రాంతం మార్మోగిపోయిందని కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల శ్రీనివాస్, సుబ్బారావు, మహేష్, కృష్ణ గౌడ్, వీరన్న, దేవా, అనూష, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..** హైదరాబాద్‌కు చెందిన సత్యశ్రీ అనే భక్తురాలు హరిబాబు ఆటోలో కొండపైకి వెళ్తుండగా, ఆమెకు తెలియకుండానే సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడు ఆటోలో జారిపడిపోయింది. దానిని గమనించిన హరిబాబు, ఏమాత్రం దురాశ పడకుండా వెంటనే ఎస్.పి.ఎఫ్ కంట్రోల్ రూమ్ ను ఆశ్రయించారు. అధికారుల ద్వారా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ లో అనౌన్స్మెంట్ చేయించి, బాధితురాలిని గుర్తించారు. అనంతరం ఆలయ ఈఓ భవాని శంకర్, ఎస్.పి.ఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు సమక్షంలో ఆ బంగారు గొలుసును బాధితురాలికి అందజేశారు. హరిబాబు నిజాయితీని ఆలయ ఈఓ అధికారులు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.

### కాకతీయ మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్ టైల్

# రీజియన్, అప్పారల్ ( పీఎం మిత్ర)పార్క్ ప్రారంభం

– వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ





**వరంగల్,10 మే (సాక్ష్యం)** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్ర) పార్క్‌లో భాగమైన కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌ను ప్రారంభించారు.ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ పరిధిలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్య రాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై వి గణేష్, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి లు,జోనల్ మేనేజర్ స్వామి, సంగెం తహసీల్దార్ రాజ్ కుమార్ ఈ సన్నివేశం లో పాల్గొని తిలకించారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ సిఎస్, డిఓలదే ముఖ్య పాత్ర


– జిల్లా ఇంటర్ విద్యా అధికారి రవికుమార్



**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ మే 10**: ఈనెల 13వ తేదీ నుండి జరగనున్న 2025-26 విద్యా సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులదే ప్రముఖ పాత్ర అని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఇంటర్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందని నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ రవికుమార్ స్పష్టం చేశారు. ఆదివారం నిజామాబాద్ బాలుర( ఖిల్లా) జూనియర్ కళాశాలలో ఉదయం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టడియన్ లు, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ ల సమావేశము జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. జిల్లాలో 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 13 నుండి 19 వరకు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు పరీక్షల నిర్వహణ లో ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇంటర్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందని, ఆయన హెచ్చరించారు. సి. ఎస్., డి.ఓ.లు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో వెంటనే సీ. సీ. కెమెరాలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రశ్న పత్రాల బండిలను సి.సి. కెమరా ల ముందే ఓపెన్ చేయాలని ఆదేశించారు. అందరూ సమయ పాలన చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు వెంటనే సమకూర్చాలని ఆదేశించారు. సెల్ ఫోన్ లను ఎట్టి పరిస్థితిలో పరీక్ష కేంద్రంలో అనుమతించే ప్రసక్తే లేదని, సి.ఎస్., డి. ఓ. లు కూడా పరీక్ష జరుగుతున్న సమయంలో పోలీస్ కస్టడీలోనే ఉంచాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు ముందే ఇన్విజిలేటర్ ల సమావేశం నిర్వహించి తగిన నియమ నిబంధనలు వివరించాలని సి.ఎస్., డి. ఓ. లను ఆయన ఆదేశించారు.ప్రతి రోజు ఫ్లయింగ్, సిట్టింగ్, ఇంటర్ బోర్డు స్క్వాడ్ లతో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు అన్ని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారని అన్నారు. సి. ఎస్. , డి. ఓ. లు సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. పరీక్ష ప్రారంభం అయ్యాక అయిదు నిమిషాల వరకు విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించవచ్చని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు.విద్యార్థిని, విద్యార్థులను పరీక్షా హాలు లోకి పంపే ముందే క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించే బాధ్యత సీ.ఎస్., డి.ఓ. లదేనని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, విద్య శాఖ, విద్యుత్, ఆర్టీసీ, హెల్త్, పోస్టల్, పోలీస్ అధికారులతో ఇదివరకే సమన్వయ సమావేశం జరిగిందని, పరీక్ష కేంద్రాల వారీగా సి.ఎస్., డి.ఓ. లు సంబంధిత స్థానిక అధికారులకు తగిన ఏర్పాట్ల కోసం లెటర్ లు రాయాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందు, పరీక్ష జరుగుతున్న సమయంలో, పరీక్ష పూర్తయిన తరువాత తీసుకోవలసిన చర్యలను పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు నుస్రత్ జహాన్, రజియా సుల్తానా, ఖిల్లా బాలుర కళాశాల ప్రిన్సిపల్ శ్రీ కాలిక్, బల్క్ అధికారి చిన్నయ్య లు తెలియజేశారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ అధికారులు, బల్క్ అధికారి శ్రీ చిన్నయ్య, బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ ఖాలిక్ లు సి.ఎస్., డి. ఓ. లకు పరీక్షల నిర్వహణ బాధ్యతలను వివరించారు.

# వక్ఫ్ భూములపై అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి

– వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు – సంబంధిత శాఖలకు లేఖ



**వరంగల్ 10 మే (సాక్ష్యం)** వరంగల్ జిల్లా ఫోర్ట్ వరంగల్ మండలంలోని ఉర్సు జాగీర్ గ్రామ పరిధిలో ఉన్న దర్గా జిందా బిక్కన్ దర్వేష్ మరియు మసీదు వక్ఫ్ భూములపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఎం. సత్య శారదాదేవి సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సర్వే నంబర్లు 273, 274, 275, 276లలో మొత్తం 17 ఎకరాల 5 గుంటల మేర నమోదైన వక్ఫ్ భూములను రక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ భూములు ఇప్పటికే గెజిట్‌లో వక్ఫ్ ఆస్తిగా నమోదై ఉన్నాయని, కోర్టు తీర్పులు కూడా వక్ఫ్ బోర్డు పక్షాన వచ్చినట్లు లేఖలో స్పష్టం చేశారు.ఈ భూములపై ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని సబ్-రిజిస్ట్రార్‌కు, అనుమతులు జారీ చేయవద్దని జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే అక్రమ ఆక్రమణదారులపై వక్ఫ్ చట్టం-1995 సెక్షన్ 52-ఎూ ప్రకారం కేసులు నమోదు చేయాలని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ అధికారులకు సూచించారు. భూముల వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్లానింగ్, వక్ఫ్ బోర్డు, టాస్క్ ఫోర్స్, పోలీస్ శాఖలతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలు, ప్లాటింగ్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. అంతేకాకుండా “ప్రొహిబిటెడ్ వక్ఫ్ ల్యాండ్”గా ఉన్న భూములు ఎలా రిజిస్ట్రేషన్ చేశారు అనే దానిపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని సూచించారు. వక్ఫ్ భూముల రక్షణ కోసం అత్యవసర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖలను ఆదేశించారు.

# కోదాడ బాప్టిస్ట్ చర్చిలో మదర్స్ డే






**కోదాడ మే 10, (సాక్ష్యం)** కోదాడ బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి ప్రేమకన్నా గొప్ప ప్రేమ ఎవరినుండి దొరకదని కొనియాడారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు. సంఘ విశ్వాసులు పెద్దలు యవ్వనస్థులు సంఘ పాటల బృందం పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియ చేసుకున్నారు. ఈ కార్యక్రమం లో క్రైస్తవులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

– అర్హులందరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందిస్తాం: ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి





**కోదాడ మే 10, (సాక్ష్యం)** పేద ప్రజలకు అండగా నిలుస్తూ సంక్షేమ పాలనను గ్రామాల దాకా తీసుకెళ్లడమే లక్ష్యమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ అండ్ చెక్కుల పంపిణీ చేసి అనంతరం మాట్లాడారు. ప్రజలకు అత్యవసర సమయంలో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 269 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.89,89,500 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఘనంగా పంపిణీ చేశారు. ప్రజల కష్టాల్లో ప్రభుత్వం తోడుంటుంది. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా నిరంతరం కృషి చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ సంకల్పం అని తెలిపారు.అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటనిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అండగా నిలుస్తున్నాయని చెప్పారు.మండలాల వారీగా చెక్కుల వివరాలు అనంతగిరి -- 40 చెక్కులు,చిలుకూరు -- 40 చెక్కులు,కోదాడ రూరల్ -- 32 చెక్కులు,కోదాడ టౌన్ -- 32 చెక్కులు,మోతే -- 56 చెక్కులు మునగాల -- 42 చెక్కులు,నడిగూడెం -- 27 చెక్కులు,మొత్తంగా 269 మంది లబ్ధిదారులకు రూ.89.89500 లక్షల రూపాయలను అందజేశారు చేశారు..ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్, మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, కోదాడ మండల పార్టీ అధ్యక్షుడు తు వరప్రసాద్ రెడ్డి, మునగాల మండల పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి, అనంతగిరి మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, నడిగూడెం మండల పార్టీ అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, పులి సులోచన రావు, గుర్రం నీలిమ గాంధీ, తుమాటి నాగిరెడ్డి , కౌన్సిలర్లు, సర్పంచ్లు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# జనగణనలో బీసీలకు ప్రత్యేక కాలమ్ కల్పించాలి

– పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్





**హైదరాబాద్, మే 10 ( సాక్ష్యం బ్యూరో ) :** దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనగణనలో బీసీ కులగణనను మొదటి విడతలోనే చేపట్టాలని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రానున్న నేపథ్యంలో హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, ఆర్థిక రంగాలలో జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే బీసీల ఖచ్చితమైన జనాభా లెక్కలు అవసరమని అన్నారు. ప్రస్తుతం జనగణనలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కాలమ్‌లు ఉన్నట్లే, 34వ కాలమ్‌ను ఏర్పాటు చేసి బీసీ కుటుంబాలను కూడా లెక్కించాలని డిమాండ్ చేశారు. దేశంలో 80 కోట్లకు పైగా ఉన్న బీసీ జనాభా వల్లే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు సార్లు అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు మరోసారి బీసీలకు హామీలు ఇస్తూ మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీసీల ఖచ్చితమైన లెక్కలు లేకపోవడంతో అనేక రాష్ట్రాల్లో రిజర్వేషన్లు కోర్టుల్లో నిలబడలేదని గుర్తు చేశారు. బీసీలు దేశంలోనే అత్యధికంగా నష్టపోతున్న వర్గమని, వారి సంఖ్య, ఆర్థిక స్థితి, జీవన ప్రమాణాలు తెలుసుకుంటేనే సమస్యల పరిష్కారానికి సరైన విధానాలు అమలు చేయగలమన్నారు. ప్రధానమంత్రి సభా వేదికపై నుంచే బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా గతంలో మహబూబ్‌నగర్ సభలో ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు--రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు జాతీయ హోదా కల్పించాలని కోరారు. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు విషయంలో వివక్ష చూపకుండా, స్థల సమస్యలను పరిష్కరించి మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వి. శ్రీనివాస్ గౌడ్ కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇండియా--పాకిస్తాన్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్ గౌడ్, మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పద్మావతికి ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సులోచనరావు





**కోదాడ మే 10, (సాక్ష్యం)** కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఇటీవల నియమించబడిన కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన పులి సులోచనరావు ఆదివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపి, తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లిక్కి గురవమ్మ వెంకటయ్య, పులి వెంకటేశ్వర్లు, తూమాటి నాగిరెడ్డి, పూర్ణ, కలకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జెబి కల్చరర్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాల ప్రధానం



**హన్మకొండ 10 మే (సాక్ష్యం)** హన్మకొండ పబ్లిక్ గార్డెన్, పద్మ శ్రీ డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ కళా ప్రాంగణం లో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో జె.బి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ, వరంగల్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ మూర్తి దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు -2026 అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం శనివారం రోజున సాయంత్రం మొదలైన కార్యక్రమం అర్ధరాత్రి వరకు అంగరంగ వైభవంగా కూచిపూడి నృత్యాలతో , ఆటపాటలతో సందడిగా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ త్యాగాలకు, నిద్రలేని రాత్రులకు మాటల్లో చెప్పలేని ప్రేమకు కూడా ధన్యవాదం చెప్పే రోజు కావాలి. కాబట్టి మాతృ మూర్తుల దినోత్సవం అంటే ఒక్కరోజు అమ్మను ప్రేమించడం కాదు. ప్రతిరోజూ ప్రేమించే ఒక ప్రత్యేక గుర్తు మాత్రమే అని అమ్మ గొప్పతనాన్ని చాటి చెప్పారు. కళాకారుల వృత్తికి అంకితభావం, సృజనాత్మకత మరియు క్రమశిక్షణ అవసరమన్నారు.నిజమైన కళాకారుడు కేవలం ప్రశంసల కోసం కాకుండా, కళ కోసం, భగవంతుని కోసం తన ప్రదర్శనను ఇస్తాడని కళాకారుడు వ్యక్తిగత చైతన్యాన్ని కోల్పోయి విశ్వ చైతన్యంలో కలిసిపోవడం వారి పరమావధి స్టేజ్ కళాకారులు సమాజానికి అద్దం పడతారు. వారి ప్రతిభ, నిబద్ధత, కళ పట్ల వారికున్న అంకితభావం అభినందనీయం. వారిని ప్రోత్సహించడం, వారి కళను గౌరవించడం మన బాధ్యత అని వారు కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఈగ మల్లేశం ని మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జె.బి కల్చరర్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు జడల శివ, జడల హరిత,డాక్టర్. హరినాధ రావు, బీటవరం శ్రీధర స్వామి,పొట్లపల్లి శ్రీనివాస్ రావు, కాజీపేట తిరుమలయ్య, జూలుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, కూరపాటి శ్రీధర్ రాజు,ఆకుల సదానందం, జనగాం రాము, కీర్తి, జూలూరి శ్రీనివాస్, కరిమిల్ల సంపత్ రావు, లక్ష్మా రెడ్డి తదితరులు మరియు అధిక సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 4లక్షల

## మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి

– జిల్లా అధనపు కలెక్టర్ వెంకారెడ్డి





**చౌటుప్పల్ మే 10 (సాక్ష్యం)** జిల్లా వ్యాప్తంగా 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశామని జిల్లా అధనపు కలెక్టర్ వెంకారెడ్డి తెలిపారు. చౌటుప్పల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి ధాన్యం కుప్పల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలోని తమ అవస్థలను రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొనుగోళ్లు వేగంగా జరగడంలేదని, కొనుగోలు జరిగిన ధాన్యం ఎగుమతి చేయడంలేదని. తూకాలు జరిగిన ధాన్యం బస్తాలకు రాత్రి వేళలో కాపాలాగా రైతులే ఉండాలని అధికారులు హుకుం జారీ చేస్తున్నారని. అన్ని కొనుగోలు కేంద్రాలలో హమాలీ చార్జీలు క్వింటాలుకు 40రూపాయలుగా ఉండగా ఇక్కడ మాత్రం నిర్బంధంగా 42రూపాయలు వసూలు చేస్తున్నారని తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఇకపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. తమ అంచనాలకు మించిన ధాన్యం ఉత్పత్తి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గత సీజన్లో 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలో 358 కొనుగోలు కేంద్రాల ద్వారా 1.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో ధాన్యం కోసం 38రైస్ మిల్లులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, దిగుబడి అవుతున్న ధాన్యానికి అందుబాటులో ఉన్న రైస్మిల్లుల సామర్థ్యం సరిపోవడంలేదన్నారు. చౌటుప్పల్ లోని ఐఎంజీ గోదాములను ధాన్యం నిల్వల కోసం తీసుకున్నామని, చౌటుప్పల్తో పాటు నారాయణపురం మండలాల ధాన్యాన్ని నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు. మన జిల్లాలోని ధాన్యాన్ని ఇతర జిల్లాలకు కేటాయించే విషయం నిర్ణయం జరగాల్సి ఉ ందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మొగుదాల పావనిరమేష్ గౌడ్, మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఆర్డీవో వెల్మ శేఖర్ రెడ్డి. మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ వీరాబాయి, మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజు గౌడ్, ఏవో ముత్యాల నాగరాజు, మార్కెట్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, సింగిలిండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య, సింగిల్ విండో సీఈవో ఎరుకల రమేష్. ఆర్ఐ సుధాకర్, కాంగ్రెస్ నాయకులు సుర్వి నర్సింహ్మా, పాక చిరంజీవి, బోయ దేవేందర్, పబ్బు శ్రీకాంత్, పెద్దగోని రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లి గోదావరిలో ఇద్దరు మృతి





**కన్నాయిగూడెం, మే 10 (సాక్ష్యం) ;** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన యువ గ్రామీణ వైద్యుడు, వార్డు సభ్యుడు బొమ్మరాజు నరేష్ యాదవ్ గోదావరిలో ఆదివారం సరదాగా ఈతకు వెళ్లి గల్లంతు అయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మరాజు నరేష్ యాదవ్ తన అల్లుళ్లతో కలిసి సరదాగా గోదావరి నది వద్దకు ఈతకు వెళ్లారని లోతు గమనించకుండా వెళ్లడంతో ప్రవాహంలో గల్లంతయ్యారని తెలిపారు. ముగ్గురు గల్లంతు కాగా చాకచక్యంగా సంపత్ అనే యువకుడు ఒడ్డుకు చేరాడు. గల్లంతు సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ వెంకటేష్ తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ళ సహాయంతో సుమారు 2 గంటల గాలింపు అనంతరం మృతదేహాలను వెలికి తీశారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు.

## అనర్హులకు వడ్డెర కార్పొరేషన్ బాధ్యతలు

– తెలంగాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కోడిదెల అంజయ్య



**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్** కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షదాయకమని, అయితే..వడ్డెర హక్కుల సాధన కోసం పని చేయని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఏ మాత్రం కృషి చేయని వ్యక్తులకు చైర్మన్, వైస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం సమంజసం కాదని తెలంగాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కోడిదెల అంజయ్య అన్నారు. వడ్డెర కులస్తుల క్షేత్ర స్థాయి స్థితిగతుల పై అవగాహన లేని వ్యక్తులకు అవకాశం ఇవ్వడం వల్ల జాతి పురోగతి అనుకున్న స్థాయిలో జరగదన్నారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలో తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్టు సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వడ్డెర సంఘం పెద్దలు, ముఖ్యుల నుండి అభిప్రాయ సేకరణ జరపకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తమకు ఆవేదన కలిగించిందన్నారు. గుంజ రేణుక, బత్తుల వెంకటేష్ బాధ్యతలు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం లాభం చేకూరదన్నారు. కాంగ్రెస్ నే నమ్ముకొని ముందుకు సాగుతున్న నిఖార్సైన వడ్డెరలకు అవకాశం దిశగా అడుగులు వేయాలని, తాజా నియామకం పై కాంగ్రెస్ పార్టీ పెద్దలు పునరాలోచించాలని సూచించారు.కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ అధ్యక్షుడు పల్లపు. నగేష్, పల్లపు ప్రదీప్, శివరాత్రి నవీన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి పుణ్యక్షేత్రంలో నిత్యారాధనలు

– యాదగిరిగుట్టలో భక్తజన సందోహం






**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్** పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి పుణ్యక్షేత్రంలో అదివారం భక్తజనుల ఆరాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వరుస సెలవులుఆదివారం సెలవురోజు కావడంతోయాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ పెరిగింది.ఉదయం నుంచే తమ కుటుంబ సభ్యులతో క్యూలైన్ల లో బారులు తీరిన భక్తులు..భక్తుల రద్దీ అధికంగా ఉ ండడంతో ఆలయ మాడవీధులు,కళ్యాణకట్ట, పుష్కరిణి, వ్రత మండపం, వాహనాల పార్కింగ్, ఘాట్ రోడ్డు పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.ధర్మ దర్శనం.రెండున్నర గంటల సమయం,ప్రత్యేక ప్రవేశ దర్శనం. గంటన్నర సమయం పడుతోంది... వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు క్షేత్రాన్ని సందర్శించి హరి, హరులను దర్శించుకున్నారు. భక్తులు తమ కుటుంబీకులతో కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, సంకల్పం చేపట్టారు. పలువురు తలనీలాలు సమర్పించారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజా ఆరోగ్యంపై కాంగ్రెస్ ప్రజా

## ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**కోదాడ (నడిగూడెం) మే 10,( సాక్ష్యం)** తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్. ఆదివారం కోదాడ క్యాంపు కార్యాలయం నందు నడిగూడెం మండలంకు చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసారు.ఈ కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏపూరి తిరుపతమ్మ సుధీర్, మండల పార్టీ అధ్యక్షుడు,రామాపురం సర్పంచ్ బూత్కూరు వెంకటరెడ్డి, నడిగూడెం,రత్నవరం, బృందావనపురం,ఈకే పేట తండా సర్పంచులు దున్నా శ్రీనివాస్,దాట్ల నాగేశ్వరరావు, కంభంపాటి సరిత చైతన్య,ధారావత్ వరలక్ష్మి వెంకటరమణ, కేశగాని సరిత లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లపు శ్రీనివాస్, కార్యదర్శి గుర్రం నీలిమా గాంధీ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల ప్రభాకర్ రెడ్డి,గడ్డం మల్లేష్ యాదవ్, మొక్క బిక్షపతి,శెట్టి సతీష్,దేవబత్తిని రమేష్ ప్రసాద్, కాసాని శివలింగం,రేపాల పురుషోత్తం,పోలంపల్లి వీరయ్య,భారీ వెంకన్న, శివ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీమాతా ఐ డయగ్నోస్టిక్ సెంటర్‌ను

## ప్రారంభించిన కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ గౌడ్



**చౌటుప్పల్ మే 10 (సాక్ష్యం)** చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు వలిగొండ రోడ్డులో (శ్రీమాతా ఐ డయగ్నోస్టిక్ సెంటర్) ను స్థానిక కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ గౌడ్ ఆదివారం తన చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రొప్రైటర్ ఆర్ శ్రీకాంత్ కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కౌన్సిలర్ ను సంస్థ యజమాని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మూడుముక్కల ఆట పేకాట రాయుళ్లు అరెస్టు





**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..**ఆదివారం రోజు మే10 యాదగిరిగుట్ట మండల పరిధిలోని రాళ్ల జనగాం గ్రామం శివారులలో కొంతమంది వ్యక్తులచే ఆర్గనైజ్డ్ గా నిర్వహించే జూదం మూడుముక్కలాట ఆడుచుండగా యాదగిరిగుట్ట మండలం లోకల్ పోలీస్, యాదాద్రి భువనగిరి జిల్లా స్పెషల్ ఆపరేషన్ టీంకు సంబంధించి నమ్మదగిన సమాచారం మేరకు అట్టి ప్రదేశానికి వెళ్లి చూడగా ఇట్టి కింది తెలిపిన వ్యక్తులు జూదం, మూడుముక్కలాట ఆడుచుండగా పట్టుబడినారు. పొగాకు సంపత్ , R/o ఆర్ బి నగర్ బోనగిరి, గుగులోతు వెంకటేష్, R/o మల్కాపురం గ్రామం తుర్కపల్లి మండలం, బైరాగి జంగాలు, R/o దాతరపల్లి గ్రామం యాదగిరిగుట్ట మండలం, వనం సతీష్, R/o దామరకుంట సిద్దిపేట, పత్తి రమేష్, R/o దామరకుంట సిద్దిపేట్, జిల్లా జహంగీర్,R/o గజ్వేల్ సిద్దిపేట్, గుంటిపల్లి కోటేష్,R/o యాదగిరి పల్లి యాదగిరిగుట్ట మండలం, ఏరువ సల్మాన్ రెడ్డి, R/o గాగిల్లాపూర్ మేడ్చల్ మల్కాజ్గిరి, మహమ్మద్ ఆజాం R/o బోనగిరి, గంగాదేవి వెంకటేష్, R/o గంగసానిపల్లి బోనగిరి ఇట్టి పైన తెలిపిన వ్యక్తులు రాళ్ల జనగాం గ్రామ శివారులో యాదగిరిగుట్ట మండల పరిధిలోని జూదం మూడుముక్కలాట ఆడుచుండగా పట్టుబడ్డారు వీరి దగ్గర పత్తాల సెట్స్ , 43,250/- రూపాయలు క్యాష్ , ఎనిమిది మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిల్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇట్టి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది.

### శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ
## ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్





**మాడుగులపల్లి మే 10 సాక్ష్యం;** మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా,శాస్త్రోక్తంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంజనేయ స్వామి భక్తులకు బుద్ధి,బలం, ధైర్యం ప్రసాదించే దైవమని కొనియాడారు. భక్తి, సేవాభావంతో నిర్మించిన ఈ ఆలయం ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను, గ్రామ ప్రజలను,దాతలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీ నిర్వాహకులు,వేద పండితులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బిఎల్అర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

### ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
## బహిరంగ సభకు తరలి వెళ్లిన బిజెపి శ్రేణులు



**మాడుగులపల్లి మే 10 సాక్ష్యం;** హైదరాబాద్ లో ఆదివారం బిజెపి ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్ లో జరుగుతున్నటువంటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభకు ఆదివారం మాడుగులపల్లి మండలం నుండి మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి కార్యకర్తలు శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మూడవసారి బిజెపి అధికారంలోకి వచ్చాక మోడీ మన రాష్ట్రానికి రావడం తొలిసారి అని అందుకే స్వాగతం పలికేందుకు మండలం నుండి భారీగా తరలి వెళ్లడం జరుగుతుందని అన్నారు. మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి విజయ దుందభి మోగించిందని తెలంగాణలో కూడా బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటరెడ్డి, బొమ్మ కంటి నరసింహా, లక్ష్మణ్, దారమళ్ళ నాగరాజు, మర్రి నాగరాజు, సాయి రెడ్డి, శ్రీకాంత్, సైదులు, బిజెపి కార్యకర్తలు నాయకులు బయలుదేరారు.

## ఐవోసీఎల్ టెర్మినల్‌ను జాతికి అంకితమిచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ










**చౌటుప్పల్ మే 10 (సాక్ష్యం )** చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం లోని ఐవోసీఎల్ టెర్మినల్ ను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం జాతికి అంకితమిచ్చారు. తెలంగాణకు విచ్చేసిన ఆయన హైదరాబాద్ నుండి వర్చువల్ గా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్న ఇందన అవసరాలను తీర్చేందుకు ఈ టెర్మినల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మల్కాపురంలోని ఐవోసీఎల్ టెర్మినల్ తెలంగాణకే కేంద్రబిందువు అవుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెలిపారు. 611కోట్ల వ్యయంతో నిర్మించిన ఐవోసీఎల్ టెర్మినల్ ద్వారా ఇప్పటికే తెలంగాణలోని 23 జిల్లాలకు పెట్రోల్, డీజిల్ ఉత్పత్తుల సరఫరా జరుగుతుంని తెలిపారు. మరో పది జిల్లాలకు సైతం సరఫరా అవ్వనుందన్నారు. సజావుగా పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా జరిగేందుకు ఈ టెర్మినల్ దోహదం చేస్తుందన్నారు. తమ ప్రభుత్వం ఎల్పీజీ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, పైప్ లైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయడమే తమ లక్ష్యమన్నారు. పశ్చిమాసియా దేశాలలో యుద్ధం జరుగుతున్నా పెట్రోలియం, గ్యాస్ ఉత్పత్తుల సరఫరాలో ఎక్కడా లోటు రాలేదన్నారు. ఈ విషయంలో కొంతమంది దుష్ప్రచారం సైతం చేశారన్నారు. ఎవరెన్ని చెప్పినా కాగా ప్రారంబోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాపురంలోని టెర్మినల్లో సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ -ఆంధ్రప్రదేశ్ సీజీఎం టీకే ఎలమరన్ సీజీఎం సూరజ్ కుమార్ పట్నాయక్, వివిధ విభాగాలకు చెందిన జిఎం లు హేమంత్, శ్రీహరి నాథ్ , రాజశేఖర్, పాపిని కిరణ్ కుమార్, శ్రీకాంత్, అండె గణేష్, చక్రవర్తి, స్థానిక సర్పంచ్ గిర్కటి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ప్రపంచానికి పునాది అమ్మే

### - చౌటుప్పల్ క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి శ్యామ్ ప్రసాద్





**చౌటుప్పల్ మే 10 (సాక్ష్యం)** ప్రతి జీవం అమ్మ ప్రేమతోనే మొదలవుతుందని చౌటుప్పల్ క్లాత్ అండ్ రెడీమేడ్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆదివారం మాతృ దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ క్లాత్ రెడీమేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చౌటుప్పల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అమ్మ త్యాగం, లాలన వెలకట్టలేనివని చెప్పారు. కరుణకు మారుపేరుగా అమ్మ నిలుస్తుందన్నారు. ఆమె నిశ్శబ్ద శక్తికి నిలువుటద్దం అని కొనియాడారు. అమ్మ స్వభావం చాలా సున్నితమైనది. కానీ ఆమె ఆత్మస్థైర్యం మాత్రం ఎంతో గొప్పదనీ, తల్లుల అంకితభావమే కుటుంబాలను చక్కగా తీర్చిదిద్దుతుందని, సమాజానికి దిశానిర్దేశం చేస్తూ మానవత్వాన్ని కాపాడేది అమ్మే" అని వారు అమ్మ యొక్క గొప్పదనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సుంకి గణేష్, మసరం యాదగిరి, పున్న రామకృష్ణ, గోశిక కరుణాకర్, గంజి రవి, తడక నరసింహ, విష్ణు, మల్లు లక్ష్మయ్య, గోశిక పాండు, కర్నాటి పిచ్చమ్మ, కోడి వనిత, మౌనిక, శాంతి, లావణ్య, గోశిక సమిత, పులిపాటి జయమ్మ, శారద, సృజన, పద్మ, మమత కలమ్మ, పుష్పలత, ఉమ, వసంత, లలిత, చంద్రకళ, సామంతకమణి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యావ్యవస్థలో సరికొత్త ప్రయోగం

### 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు సెమిస్టర్ విధానం?



**హైదరాబాద్ మే 10 (సాక్ష్యం)** తెలంగాణ విద్యా విధానం కమిటీ రాష్ట్రంలో 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. వార్షిక పరీక్షల వల్ల విద్యార్థులపై పడే ఒత్తిడిని తగ్గించి, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై శ్రద్ధ చూపేలా ఈ మార్పు చేయనున్నారు. థియరీ కంటే ప్రాక్టికల్స్‌కు, అనుభవపూర్వక అభ్యసనానికి ప్రాధాన్యతనిస్తూ, పాఠశాల విద్యలో ఇంటర్‌ను విలీనం చేసే అంశాన్ని కూడా కమిటీ పరిశీలిస్తోంది. తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో చారిత్రాత్మక మార్పులకు సర్కార్ సిద్ధమవుతోంది. ప్రస్తుతమున్న వార్షిక విద్యా విధానం స్థానంలో.. ఉన్నత విద్య (యూజీ/పీజీ) తరహాలోనే పాఠశాల స్థాయిలోనూ సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టే దిశగా తెలంగాణ విద్యా విధానం కమిటీ సభ్యులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి నుంచి ప్రారంభించి పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు ఈ నూతన విధానాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీనివల్ల విద్యార్థులు ఏడాది పొడవునా సిలబస్ మొత్తాన్ని గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. సిలబస్‌ను రెండు భాగాలుగా విభజించి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులపై మానసిక ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక విధానంలో విద్యార్థులు పరీక్షలకు కొద్ది నెలల ముందు మాత్రమే పుస్తకాలు పట్టే ధోరణి కనిపిస్తోంది. అలాగే, మార్చి, ఏప్రిల్ నెలల్లో భారీ సిలబస్‌ను పునశ్చరణ చేయడం విద్యార్థులకు సవాలుగా మారుతోంది. సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చదువుపై దృష్టి సారిస్తారు. మొదటి సెమిస్టర్‌లో సాధించిన ఫలితాలను బట్టి ఉపాధ్యాయులు విద్యార్థుల బలహీనతలను గుర్తించి రెండో సెమిస్టర్ నాటికి వారిని మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు కూడా ఈ విధానానికి సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒకవేళ స్కూల్ స్థాయిలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే తొలుత ఇంటర్మీడియట్‌కైనా ఈ విధానాన్ని వర్తింపజేయాలని కమిటీ భావిస్తోంది. ఈ మార్పులతో పాటు, బట్టీ పద్ధతికి స్వస్తి పలికి అనుభవపూర్వక అభ్యసన విధానానికి ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. కేవలం థియరీ పాఠాలకే పరిమితం కాకుండా విద్యార్థులు తాము చదువుతున్న విషయాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకునేలా ల్యాబ్‌లను ఆధునీకరించనున్నారు. ప్రతి విషయాన్ని జ్ఞాపకశక్తితో కాకుండా, అనుభవపూర్వకంగా నేర్చుకోవడం వల్ల అది వారి మెదడులో శాశ్వతంగా నిలిచిపోతుందని కమిటీ బలంగా నమ్ముతోంది. ఇందులో భాగంగానే పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే ప్రక్రియను కూడా ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు. ల్యాబ్‌ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనపై కూడా కమిటీ ప్రత్యేక నివేదికను రూపొందిస్తోంది. విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంచడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షలకు తెలంగాణ విద్యార్థులను సిద్ధం చేయడమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశ్యం. ఈ ప్రతిపాదనలు గనుక పట్టాలెక్కితే.. తెలంగాణ విద్యా వ్యవస్థ దేశంలోనే ఒక ఆదర్శవంతమైన నమూనాగా మారనుంది. టీచర్లు కూడా ప్రణాళికాబద్ధంగా సిలబస్‌ను పూర్తి చేసేందుకు ఈ సెమిస్టర్ విధానం ఎంతో సహకరిస్తుందని కమిటీ సభ్యులు వెల్లడించారు.

## తెలంగాణలో పెరగనున్న భూముల విలువ

**హైదరాబాద్ మే 10 (సాక్ష్యం)** తెలంగాణ ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలను మే 26 నుంచి సవరించాలని నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ధరలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని ప్రజలు పోటీ పడుతుండటంతో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పనివేళలను పొడిగించింది. ముఖ్యంగా హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లోని 15 ప్రధాన కార్యాలయాల్లో ఉదయం 9.30 నుండి సాయంత్రం 6.30 వరకు సేవలు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్థిరాస్తుల మార్కెట్ విలువలను పెంచాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఒక్కసారిగా బిజీ అయిపోయింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత భూముల విలువలను 20 శాతం నుండి 100 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నూతన ధరలు మే 26 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉండటంతో పాత ధరలకే తమ రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని సామాన్యుల నుంచి బిల్డర్ల వరకు అందరూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ఈ భారీ రద్దీని క్రమబద్ధీకరించేందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఈ నెల 12 నుంచి 15 వరకు ఎంపిక చేసిన 15 ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పనివేళలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ నాలుగు రోజుల పాటు కార్యాలయాలు ఉదయం 9.30 గంటలకే తెరుచుకుని సాయంత్రం 6.30 గంటల వరకు నిరంతరాయంగా పనిచేస్తాయి. రద్దీ ఎక్కువగా ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో ఈ నిబంధనలు వర్తిస్తాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూడాలని, తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు.




# చెన్నై సూపర్ కింగ్స్ థ్రిల్లింగ్ విక్టరీ

## లక్నోపై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం

ఉత్కంఠభరితంగా జరిగిన ఐపీఎల్ 2026 లీగ్ మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. చేపాక్ మైదానంలో ఆదివారం డబుల్ హెడర్ లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్ లో 5 వికెట్లతో చెన్నై ఘనవిజయం సాధించింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 203 పరుగులు చేసింది. ఓపెనర్ జోస్ ఇంగ్లిస్ స్టన్నింగ్ ఫిఫ్టీ (33 బంతుల్లో 85, 10 ఫోర్లు, 6 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో జామీ ఓవర్టన్ కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ను ఆఖరి ఓవర్లో చెన్నై కంప్లీట్ చేసింది. 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 208 పరుగులు చేసింది. వన్ డౌన్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ స్టన్నింగ్ ఫిఫ్టీ (23 బంతుల్లో 65, 2 ఫోర్లు, 8 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో దిగ్వేష్ రాఠీ, షాబాజ్ అహ్మద్ కు రెండేసి వికెట్లు దక్కాయి. 2019 తర్వాత 180o టార్గెట్ ను ఛేజ్ చేయడం సీఎస్కేకు ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విజయంతో ఆరో విజయంతో ఐదోస్థానానికి ఎగబాకింది. ఈ పరాజయంతో లక్నో టోర్నీ నుంచి నిష్క్రమించింది. సోమవారం జరిగే మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది. 204 పరుగుల భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన చెన్నైకి శుభారంభమే దక్కింది. ఫామ్ లో ఉన్న ఓపెనర్ సంజూ శాంసన్ (14 బంతుల్లో 28, 3



ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడాడు. రెండు కళ్లు చెదిరే సిక్సర్లతో సత్తా చాటాడు. అయితే దిగ్వేశ్ రాఠీ బౌలింగ్ లో వరుసగా సిక్సర్, ఫోర్ కొట్టి, మరో భారీ షాట్ కు ప్రయత్నించి, క్లీన్ బౌల్డయ్యాడు. ఈ దశలో బ్యాటింగ్ కు దిగిన ఉర్విల్ పటేల్ విశ్వరూపం చూపించాడు. సిక్సర్లతోనే డీల్ చేశాడు. ఆరంభంలో తను, అవేశ్ ఖాన్ లో మూడు సిక్సర్లు కొట్టడంతోపాటు రుతురాజ్ కూడా సిక్సర్ కొట్టడంతో 25 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత దిగ్వేశ్ బౌలింగ్ లో 3సిక్సర్లు, ఒక ఫోర్ తో పటేల్ రెచ్చిపోయాడు. ఒక దశలో పది బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేస్తాడని అనిపించింది. కానీ తర్వాత కాస్త నెమ్మదించాడు. దీంతో 13 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. దీంతో 2023లో యశస్వి జైస్వాల్ నమోదు చేసిన 13 బాల్ ఫిఫ్టీ రికార్డును ఉర్విల్ సమం చేశాడు. ఓవరాల్ గా పవర్ ప్లేలో 97 పరుగులను పిండుకుంది. మరో ఓపెనర్ కమ్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (42) సమయోచితంగా ఆడాడు.

### ఫీల్డింగ్ వైఫల్యమే కొంపముంచింది: రిషబ్ పంత్

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా సీఎస్కేతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో లక్నో సూపర్ జెయింట్స్ పరాజయం పాలైంది. ఓటమి అనంతరం లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ తన మనసులోని మాటను పంచుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత రిషబ్ పంత్ మాట్లాడుతూ.. ఇదొక అద్భుతమైన మ్యాచ్ అని, రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయని అభిప్రాయపడ్డాడు. చెన్నైలో మ్యాచ్ అంటేనే ఒత్తిడి ఉంటుందని మాకు తెలుసని.. దానికి తగ్గట్టుగానే సీఎస్కే తమపై తీవ్ర ఒత్తిడి పెంచిందని పంత్ పేర్కొన్నాడు.ఈ మ్యాచ్‌లో లక్నో ఓటమికి ప్రధాన కారణం ఫీల్డింగ్ అని రిషబ్ పంత్ బాహాటంగానే ఒప్పుకున్నాడు. టీ20 క్రికెట్‌లో ఫీల్డింగ్ ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉండాలని.. కానీ ఈరోజు తమ జట్టులో మరీ ఎక్కువగా క్యాచ్‌లు డ్రాప్ అయ్యాయని అసహనం వ్యక్తం చేశాడు. ఫీల్డింగ్ సరిగ్గా లేకపోతే భారీ లక్ష్యాన్ని కాపాడుకోవడం కష్టమని రిషబ్ పంత్ గుర్తుచేశాడు.సీఎస్కే బ్యాటర్ ఉర్విల్ పటేల్ ఆడిన ఇన్నింగ్స్‌ను రిషబ్ పంత్ కొనియాడాడు. ఉర్విల్ నమ్మశక్యం కాని రీతిలో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడని.. లక్నో జట్టు కోసం జోష్ ఇంగ్లిస్ ఎలాగైతే విధ్వంసం సృష్టించాడో, సీఎస్కే కోసం ఉర్విల్ కూడా అదే స్థాయిలో మెరుపులు మెరిపించాడని చెప్పాడు. ఎవరో ఒకరు ఎదురుదాడి చేయాల్సి ఉంటుందని.. తమ తరఫున ఇంగ్లిస్ ఆ పని చేస్తే, వారి తరఫున ఉర్విల్ ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాడని రిషబ్ పంత్ విశ్లేషించాడు.తమ ఇన్నింగ్స్ ఆరంభమైన తీరు చూసి కనీసం 210 పరుగులు చేస్తామని భావించామని.. అయితే 203 పరుగులు కూడా మంచి స్కోరేనని పంత్ అన్నాడు. ఆరంభంలో బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్.. ఆ తర్వాత నెమ్మదించిందని తెలిపాడు. చివరి ఓవర్‌లో షాబాజ్ అహ్మద్‌తో బౌలింగ్ చేయించాలనే ఆలోచన వచ్చినప్పటికీ. అప్పుడు క్రీజులో ఇద్దరు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఉండటం వల్ల మార్‌క్రమ్ వైపే మొగ్గు చూపామని చెప్పాడు. మార్‌క్రమ్ గతంలో ఇలాంటి పరిస్థితుల్లో వికెట్లు తీసిన అనుభవం ఉండటంతోనే ఆ నిర్ణయం తీసుకున్నట్లు రిషబ్ పంత్ వివరించాడు.






# రాయల్ చాలెంజర్స్ బెంగళూరు థ్రిల్లింగ్ విక్టరీ

ఐపీఎల్ 2026 సీజన్ లో భాగంగా ఆదివారం ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్ లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. చివరి బంతి వరకు జరిగిన ఈ మ్యాచ్ లో 2 వికెట్లతో గెలుపొందింది. రాయ్ పూర్ లో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులు చేసింది. తెలుగు స్టార్ తిలక్ వర్మ సూపర్బ్ ఫిఫ్టీ (42 బంతుల్లో 57, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. వెటరన్ భువనేశ్వర్ కుమార్ నాలుగు వికెట్లతో పర్పుల్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అనంతరం ఛేజింగ్ లో ఓవర్లన్నీ ఆడిన ఆర్సీబీ.. 8 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఆల్ రౌండర్ క్రునాల్ పాండ్యా స్టన్నింగ్ ఫిఫ్టీ (46 బంతుల్లో 73, 4 ఫోర్లు, 5 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు.

కార్బిన్ బాష్ నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు. భువనేశ్వర్ కు ప్లేయర్ ఆఫ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ విజయంతో ఆర్సీబీ 14 పాయింట్లు, మెరుగైన రన్ రేట్ తో టాప్ ప్లేస్ ను దక్కించుకున్నాడు. ఈ విజయంతో టోర్నీ నుంచి ముంబై, లక్నో టోర్నీ నుంచి ఎలిమినేట్ అయ్యాయి. సోమవారం జరిగే మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది.ఓ మాదిరి టార్గెట్ తో బరిలోకి దిగిన ఆర్సీబీకి ఆరంభంలోనే షాక్ తగిలింది. ఆడిన తొలి బంతికే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ డకౌట్ అయ్యాడు. గత మ్యాచ్ లోనూ కోహ్లీ డకౌట్ అయిన సంగతి తెలిసిందే. కాసేపటికే కుదురుగా ఆడుతున్న దేవదత్ పడిక్కల్ (12), కెప్టెన్ రజత్ పతిదార్ (8) ఔటయ్యారు. దీంతో 39 పరుగులకే కీలకమైన మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఓపెనర్ జాకబ్ బెతెల్ (27), క్రునాల్ పాండ్యా జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరంభంలో ఆచితూచి ఆడటంతో ఆర్సీబీ కోలుకుంది. పవర్ ప్లేలో 47 పరుగులు సాధించింది. వీరిద్దరూ నాలుగో వికెట్ కు 55 పరుగులు జోడించిన తర్వాత బెతెల్ ఔట్ కావడంతో ఆర్సీబీ కాస్త కష్టాల్లో పడింది. ఈ దశలో జితేశ్ శర్మ (18) తో కలిసి క్రునాల్ వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. ముఖ్యంగా జితేశ్ రెండు సిక్సర్లతో మంచి జోరు కనబర్చాడు. ఇదే జోరులో 32 బంతుల్లోనే క్రునాల్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అయితే కాసేపటికి జితేశ్ ఔట్ కావడంతో ఆర్సీబీ కష్టాల్లో పడింది. టిమ్ డేవిడ్ కూడా డకౌట్ కావడం, క్రాంప్స్ తో క్రునాల్ ఇబ్బంది పడటంతో ఆర్సీబీకి ఈ మ్యాచ్ లో ఓటమి ఎదురవతుందని అనిపించింది. అయితే గాయంతో బాధపడుతూనే ఘజన్ ఫర్ బౌలింగ్ లో రెండు భారీ సిక్సర్లు బాదిన క్రునాల్ .. జట్టును విజయం వైపుకు తీసుకువచ్చాడు. అయితే కీలకదశలో తను ఔట్ కావడం, రొమారియో షెఫర్డ్ (4) బంతులు వేస్ట్ చేసి ఔట్ కావడంతో ఆర్సీబీకి పరాజయం ఖాయం అనిపించింది. ఈ దశలో చివరి ఓవర్ వేసిన రాజ్ బవా బౌలింగ్ లో భారీ సిక్సర్ కొట్టిన భువీ.. ఆర్సీబీని మ్యాచ్ లోకి తీసుకువచ్చాడు. ఆఖరి బంతికి రెండు పరుగులు అవసరమైన దశలో రసిక్ సలామ్ (3 నాటౌట్) డబుల్ రన్ తీయడంతో ఆర్సీబీ విజయం సాధించింది. దీంతో పట్టికలో టాప్ ప్లేస్ కు ఆర్సీబీ చేరుకుంది.

# వైభవ్ సూర్యవంశీ విశ్వరూపం..

టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ప్రతిరోజూ క్రికెట్ రికార్డు పుస్తకాలను తిరగరాస్తున్నాడు. శనివారం రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన మ్యాచ్ లో సిరాజ్ వేసిన తొలి బంతికే సిక్స్ కొట్టి టీ20ల్లో వేగంగా



100 సిక్సర్లు పూర్తి చేసిన ప్లేయర్ గా వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. కేవలం 514 బంతుల్లోనే ఈ మార్కును చేరుకుని చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్ లో పవర్ ప్లేలోనే 30 సిక్సర్లు బాది అభిషేక్ శర్మ రికార్డును కూడా అధిగమించాడు.. 15 ఏళ్ల వయసులో ఇలాంటి హిట్టింగ్ తో వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ప్రపంచ క్రికెట్ లో హాట్ టాపిక్ గా మారాడు. ఐపీఎల్ 2026 సీజన్ లో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆడుతున్న ఇన్నింగ్స్ లు చూస్తుంటే దిగ్గజ బ్యాటర్లే ఆశ్చర్యపోతున్నారు. శనివారం జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో అతను మరో అద్భుతాన్ని ఆవిష్కరించాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ బౌలింగ్ లో ఎదుర్కొన్న మొదటి బంతినే స్టాండ్స్ లోకి పంపిన వైభవ్, టీ20 ఫార్మాట్ లో అత్యంత వేగంగా 100 సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. కేవలం 514 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించడం గమనార్హం. గతంలో ఎంతో మంది స్టార్ ప్లేయర్లకు సాధ్యం కాని ఈ రికార్డును ఈ 15 ఏళ్ల కుర్రాడు తన ఖాతాలో వేసుకున్నాడు. వైభవ్ సూర్యవంశీ కేవలం సిక్సర్ల వేగంలోనే కాదు, పవర్ ప్లేలో కూడా సరికొత్త బెంచ్ మార్క్ సెట్ చేశాడు. ఈ మ్యాచ్ లో 16 బంతుల్లో 36 పరుగులు చేసిన వైభవ్ ఇన్నింగ్స్ లో మూడు ఫోర్లు, మూడు భారీ సిక్సర్లు ఉన్నాయి. ఈ మూడు సిక్సర్లు కూడా పవర్ ప్లే (1-6 ఓవర్లు) లోనే రావడం విశేషం. దీంతో ఒకే ఐపీఎల్ సీజన్ లో పవర్ ప్లేలో అత్యధిక సిక్సర్లు (30) కొట్టిన ప్లేయర్ గా అతను నిలిచాడు. 2024లో అభిషేక్ శర్మ నెలకొల్పిన 29 సిక్సర్ల రికార్డును వైభవ్ క్రాస్ చేశాడు. ఈ లిస్ట్ లో ట్రావిస్ హెడ్, యశస్వి జైస్వాల్ వంటి బిగ్ హిట్టర్లు వైభవ్ కంటే వెనుకంజలో ఉన్నారు. టాస్ గెలిచి రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ యశస్వి జైస్వాల్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో గుజరాత్ టైటాన్స్ బ్యాటింగ్ కు దిగింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ ఆరంభం నుంచే అటాకింగ్ గేమ్ ఆడారు. రాజస్థాన్ స్టార్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ వేసిన మొదటి ఓవర్ లోనే 18 పరుగులు రాబట్టి తమ ఉద్దేశాన్ని స్పష్టం చేశారు. గిల్ 44 బంతుల్లో 84 పరుగులు చేయగా, సుదర్శన్ 36 బంతుల్లో 55 పరుగులు జోడించాడు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్ కు 118 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. గిల్ ఈ సీజన్ లో తన నాలుగో హాఫ్ సెంచరీని పూర్తి చేసుకుని టీమ్ ను పటిష్ట స్థితిలో ఉంచాడు.మిడిల్ ఓవర్లలో వికెట్లు పడినా, చివరిలో వాషింగ్టన్ సుందర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. కేవలం 20 బంతుల్లోనే 37 పరుగులు చేసి గుజరాత్ స్కోరును 200 దాటించాడు. తుషార్ దేశ్‌పాండే వేసిన ఆఖరి ఓవర్ లో సుందర్, రాహుల్ తెవాటియా కలిసి 21 పరుగులు పిండుకున్నారు. ఆ ఓవర్ లో మూడు సిక్సర్లు బాదడంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరును బోర్డుపై పెట్టింది. రాజస్థాన్ బౌలర్లలో యశ్‌రాజ్ పుంజా కొంత ప్రభావం చూపాడు. మరోవైపు వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్ లో ఇప్పటికే రెండు సెంచరీలు సాధించాడు. అవి కూడా 40 కంటే తక్కువ బంతుల్లోనే కావడం అతని హిట్టింగ్ పవర్ కు నిదర్శనం. గుజరాత్ టైటాన్స్ ఈ మ్యాచ్ లో సాధించిన భారీ స్కోరుతో రాజస్థాన్ రాయల్స్ కు గట్టి సవాల్ విసిరింది. ముఖ్యంగా వైభవ్ లాంటి యంగ్ టాలెంట్ ఇలాంటి రికార్డులు సృష్టించడం ఐపీఎల్ లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

# సంజూ శాంసన్ సలహా వల్లే గెలిచాం

## సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్

చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా లక్నో జట్టుపై సీఎస్కే ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసింది. ఈ గెలుపు అనంతరం సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఎంతో సంతోషం వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్‌లో రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ.. ఈ విజయం తమకు ఎంతో కీలకమని, పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపరుచుకోవడానికి ఇది బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. ప్లేయర్లందరూ సమిష్టిగా కృషి చేసి లక్ష్యాన్ని పూర్తి చేశారని, ముఖ్యంగా పవర్‌ప్లేలో తాము ఆశించిన దానికంటే మెరుగైన ప్రదర్శన కనబరిచామని, అదే గెలుపుకు బలమైన పునాది వేసిందని రుతురాజ్ గైక్వాడ్ ప్రశంసించాడు.ప్రత్యర్థి జట్టు బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్‌ను రుతురాజ్ మనస్ఫూర్తిగా అభినందించాడు. జోష్ ఇంగ్లిస్ అద్భుతమైన షాట్లతో విరుచుకుపడ్డాడని.. ఆ సమయంలో తమ బౌలర్ల వద్ద అతని దూకుడును అడ్డుకోవడానికి ఎటువంటి సమాధానం లేకపోయిందని నిజాయితీగా ఒప్పుకున్నాడు. అతని ఆట తీరు ఒక దశలో మ్యాచ్‌ను తమ నుంచి పూర్తిగా లాగేసుకునేలా కనిపించిందని, ఆ సమయంలో తమ వ్యూహాలు కూడా పని చేయలేదని రుతురాజ్ అభిప్రాయపడ్డాడు. మ్యాచ్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు సంజూ శాంసన్‌తో




జరిగిన చర్చను రుతురాజ్ గుర్తుచేసుకున్నాడు. “పవర్‌ప్లే ముగిసే సమయానికి లక్నో స్కోరు చూసి వాళ్లు చాలా ముందున్నారని మాకు అర్థమైంది. అప్పుడు సంజూ నాతో మాట్లాడుతూ.. మనం ఏదో ఒక మార్గాన్ని కనిపెట్టాలి, లేదంటే మ్యాచ్ చేజారిపోతుంది అని అన్నాడు” అని వివరించాడు. ఆ తర్వాత నూర్ అహ్మద్, జేమీ ఓవర్టన్ అద్భుతంగా బౌలింగ్ చేసి కీలక వికెట్లు తీయడంతోనే తాము తిరిగి పుంజుకున్నామని కొనియాడాడు. ఈ వికెట్‌పై 220 నుంచి 230 పరుగులు చేయడం కష్టమేమీ కాదని.. కానీ తమ బౌలర్లు వారిని 203 పరుగులకే కట్టడి చేయడం అభినందనీయమని అన్నాడు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై స్పందిస్తూ.. చెన్నైలో ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్లేయర్లు శారీరకంగా చాలా అలసిపోతున్నారని, అందుకే కొంత విశ్రాంతి అవసరమని రుతురాజ్ అన్నాడు. గత బ్రేక్ సమయంలో తమ జట్టులోని కొన్ని లోపాలను సరిదిద్దుకున్నామని, అది ఈ మ్యాచ్‌లో స్పష్టంగా కనిపించిందని తెలిపాడు. లీగ్ దశలో ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయని, ఒత్తిడి తీసుకోకుండా విషయాలను సరళంగా ఉంచడమే తమ విజయ మంత్రమని రుతురాజ్ గైక్వాడ్ ఈ సందర్భంగా వెల్లడించాడు.



### 17 బంతుల్లోనే జోష్ ఇంగ్లిస్ హాఫ్ సెంచరీ

చెన్నైలోని చెపాక్ స్టేడియం సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలిస్తుందని పేరు. కానీ ఆదివారం జరిగిన మ్యాచ్ లో మాత్రం సీన్ రివర్స్ అయింది. లక్నో సూపర్ జెయింట్స్ ఓపెనర్ జోష్ ఇంగ్లిస్ తన పవర్ ఫుల్ హిట్టింగ్ తో స్టేడియం నలుమూలల సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపించాడు. లక్నో జట్టు ఈ మ్యాచ్ లో కీలక మార్పు చేస్తూ ఇంగ్లిస్ ను తుది జట్టులోకి తీసుకుంది. ఈ నిర్ణయం సరైనదే అని ఇంగ్లిస్ తన బ్యాటింగ్ తో నిరూపించాడు. కేవలం 17 బంతుల్లోనే 50 పరుగుల మార్కును చేరుకుని ఐపీఎల్ చరిత్రలో చెపాక్ స్టేడియం వేదికగా అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ బాదిన ఘనతను తన సొంతం చేసుకున్నాడు.గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడిన సామ్ బిల్లింగ్స్ 2018లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై 21 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. ఇన్నేళ్లుగా ఆ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది. అయితే జోష్ ఇంగ్లిస్ మాత్రం ఆదివారం లక్నో ఇన్నింగ్స్ లో విధ్వంసం సృష్టించి ఆ రికార్డును తుడిచిపెట్టేశాడు. కేవలం 17 బంతుల్లోనే మైలురాయిని చేరుకోవడమే కాకుండా, తన ఇన్నింగ్స్ ఆద్యంతం చెన్నై బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. 85 పరుగులు చేసిన తర్వాత జేమీ ఓవర్టన్ బౌలింగ్ లో వెనుదిరిగినా, అప్పటికే లక్నోకు కావాల్సిన పటిష్టమైన పునాదిని అందించాడు.టాస్ గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మొదట బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ పై కవర్లు ఉండటం, వర్షం సూచనలు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. అయితే డే మ్యాచుల్లో పిచ్ ప్రవర్తన భిన్నంగా ఉంటుందని, త్వరగా పరిస్థితులకు అలవాటు పడటం ముఖ్యమని పేర్కొన్నాడు.



# 'పురుష:' ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సమ్మర్‌లో మే 22న రాబోతోంది.. ప్రెస్ మీట్‌లో హీరో పవన్ కళ్యాణ్

బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వర రావు 'పురుష:' సినిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ



కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా మే 22న రిలీజ్ కాబోతుందని ప్రకటిస్తూ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ .. ''పురుష:' కోసం సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నేను ఇలా ఈ స్టేజ్ మీద నిల్చున్నానంటే దానికి మా నాన్న గారే కారణం. నన్ను నమ్మి ఈ పాత్రను ఇచ్చిన వీరు అన్నకి థాంక్స్. నాకు యాక్టింగ్‌లో సపోర్ట్ చేసిన సప్తగిరి అన్నకి, కసిరెడ్డి అన్నకి థాంక్స్. సక్సెస్ ఫుల్‌గా ఈ మూవీని పూర్తి చేశాం. మా అందరినీ బాగా చూపించిన సతీష్ గారికి థాంక్స్. మా చిత్రం కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఈ సమ్మర్‌లో 'పురుష:' మే 22న రాబోతోంది. నిర్మాతగా మా నాన్న గారు అనుకున్న స్థాయిలోనే సినిమాని తీశామని, నేను నటించానని అనుకుంటున్నాను. అందరూ మా సినిమాని చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. దర్శకుడు వీరు వులవల మాట్లాడుతూ .. ''పురుష:' విషయంలో నాకు సపోర్ట్ చేసిన నిర్మాత కోటేశ్వరరావు గారికి థాంక్స్. ఈ జర్నీలో అండగా నిలిచిన మా కెమెరామెన్ సతీష్ గారికి థాంక్స్. పవన్ కళ్యాణ్ గారి యాక్టింగ్‌కి ఆడియెన్స్ ఫిదా అవుతారు. ఈ సినిమాలో నటించిన సప్తగిరి గారు, కసిరెడ్డి గారు, మా హీరోయిన్లకు థాంక్స్. నేను 'మళ్లీరావా', 'జెర్సీ', 'మసూద' చిత్రాలకు పని చేశాను. నేను ఈ కథని ఎలా అనుకున్నానో అలానే తీయగలిగాను. సమ్మర్ స్పెషల్‌గా మా సినిమాని మే 22న రిలీజ్ చేయబోతోన్నాం. అందరూ చూసి మా మూవీని సపోర్ట్ చేయాలని, ఈ ప్రయాణంలో మీడియా మాకు తోడుగా ఉండాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. సప్తగిరి మాట్లాడుతూ .. ''పురుష:' సినిమా మొత్తం మా డైరెక్టర్ వీరూ గారి పైనే ఆధారపడి ఉంది. మా నుంచి మంచి నటనను రాబట్టుకున్నాడు. సినిమా ఎలా ఉంది.. స్క్రీన్ ప్లే ఎలా ఉంది అనేది తెలియాలంటే మే 22 వరకు వేయిట్ చేద్దాం. తప్పకుండా ఆయన తన మార్కు చూపించే ప్రయత్నం చేశాడు. హీరోగా ఎంట్రీ ఇస్తున్న పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు. మా ముగ్గురు హీరోయిన్‌లు, కసిరెడ్డి తమ్ముడు అందరూ బాగా నటించారు. మా దర్శకుడు వీరూ పేరు ఈ ఒక్క సినిమాతో కాకుండా ఒక పది సంవత్సరాలు వినపడేలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము'ని అన్నారు. కసిరెడ్డి రాజ్ కుమార్ మాట్లాడుతూ .. ''పురుష:' చిత్రం మే 22న రిలీజ్ కాబోతుంది. ఈ సినిమా పురుషులు అందరు తల ఎత్తుకునేలా ఉంటుంది. పవన్ కళ్యాణ్ ఈ సినిమాతో ఇంట్రడ్యూస్ అవుతున్నాడు. సప్తగిరి అన్నతో ఫస్ట్ టైమ్ నేను స్క్రీన్ షేర్ చేసుకున్నాను. అన్న నుంచి నేను చాలా నేర్చుకున్నాను. మా హీరోయిన్లు ముగ్గురు కూడా మీకు ఖచ్చితంగా నచ్చుతారు. ఇక్కడకు వచ్చి మాకు సపోర్ట్ చేస్తున్న అందరికీ కూడా థ్యాంక్యూ సో మచ్' అని అన్నారు. హాసిని సుధీర్ మాట్లాడుతూ .. 'నా ఫస్ట్ సినిమా 'పురుషోత్తముడు'. ఇది నా రెండో సినిమా. నాకు ఈ సినిమాలో ఛాన్స్ ఇచ్చిన డైరెక్టర్, ప్రొడ్యూసర్‌లకు స్పెషల్ థ్యాంక్స్. ఫస్ట్ టైమ్ స్టోరీ విన్నప్పుడు ఈ సినిమాలో నువ్వు హీరోయిన్‌గా చేస్తున్నావ్ అని వాళ్లు చెప్పారు. ఈ సినిమా టీంతో పని చేయడం ఆనందంగా ఉంది. మా చిత్రం మే 22న రాబోతోంది. అందరూ తప్పకుండా చూడండి' అని అన్నారు. రాయంచ మాట్లాడుతూ .. 'నాకు ఈ 'పురుష:' సినిమాలో ఛాన్స్ ఇచ్చిన డైరెక్టర్ వీరూ గారికి స్పెషల్ థ్యాంక్స్. మమ్మల్ని సపోర్ట్ చేస్తూ వచ్చిన నిర్మాత గారికి కూడా ధన్యవాదాలు. ఎంతో సరదాగా షూటింగ్ చేశాం. అందరి నుంచి చాలా నేర్చుకున్నాను. మా సినిమా మే 22 న రిలీజ్ కాబోతుంది. అందరూ చూసి హిట్ చేయండి' అని అన్నారు. విషిక మాట్లాడుతూ .. 'మా 'పురుష:' సినిమాను సపోర్ట్ చేస్తున్న మీడియాకు ధన్యవాదాలు. మా డైరెక్టర్ వీరూ సార్ చాలా ఫన్నీగా ఉంటారు. నేను హీరోయిన్‌గా నటించిన ఫస్ట్ మూవీ ఇది. ఈ సినిమాను అందరూ ఆదరిస్తారు అనుకుంటున్నాను. అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. మే 22న థియేటర్‌లో రిలీజ్ అవుతున్న ఈ సినిమాని ఫ్యామిలీతో కలిసి చూడండి' అని అన్నారు.

## నెట్ ఫ్లిక్స్‌లో నాన్ ఇంగ్లీష్ మూవీస్ కేటగిరీలో 1.2 మిలియన్ వ్యూస్‌తో టాప్ 7 స్థానంలో ట్రెండ్ అవుతున్న బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ 'రాకాస'

'రాకాస' సినిమాకు థియేటర్లో అద్భుతమైన స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఓటీటీలోనూ ఈ చిత్రం దూసుకుపోతోంది. నెట్ ఫ్లిక్స్ గ్లోబల్ చార్ట్‌లో టాప్ 7కి 'రాకాస' చేరుకుంది. ఏప్రిల్ 27 నుంచి మే 3 వరకు 1.2 మిలియన్ వ్యూస్‌తో ఏడో స్థానంలో ట్రెండ్ అవుతూ ఉందని నెట్ ఫ్లిక్స్ సంస్థ ప్రకటించింది. ఈ ఘనతతో ఈ వారం నెట్ ఫ్లిక్స్‌పై ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వీక్షించిన ఆంగ్లేతర చిత్రాల జాబితాలో 'రాకాస' పలు అంతర్జాతీయ మార్కెట్ల చిత్రాల సరసన నిలిచింది. థియేటర్లలో ఈ సినిమాకు వచ్చిన రెస్పాన్స్ కంటే డిజిటల్ స్ట్రీమింగ్‌లో మరింత ఆదరణ లభిస్తోందని ఈ లెక్కలే చెబుతున్నాయి. థియేటర్లలో నెమ్మదిగా మౌత్ టాక్‌తో దూసుకుపోయిన ఈ సినిమా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా క్లియర్ రెస్పాన్స్ పొందినట్టుగా దూసుకుపోతోంది. థియేటర్లలోనే ఈ మూవీని అందరూ ఫ్యామిలీతో కలిసి చూసి ఎంజాయ్ చేశారు. ఇక ఇప్పుడు అదే ఆదరణ ఓటీటీలోనూ కనిపిస్తోంది. ప్రమోషన్స్‌తోనే అందరినీ ఆకట్టుకున్న 'రాకాస' టీం.. థియేటర్లలో మ్యాజిక్ చేసింది. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు అందరినీ ఈ చిత్రం ఆకట్టుకుంది. ఇక దీంతో ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ కోసం అందరూ ఎదురు చూడసాగారు. ఓటీటీలోకి 'రాకాస' అలా వచ్చిందో లేదో ఇలా టాప్‌లో ట్రెండ్ అయింది. సంగీత్ శోభన్ – గెటప్ శ్రీను ట్రాక్, వెన్నెల కిషోర్ నటన ఈ సినిమాను పదేపదే చూసేలా చేయడంలో ఎంతగానో దోహదపడ్డాయి. పిల్లలకు ఈ చిత్రంలోని ఫాంటసీ నచ్చితే.. పెద్ద వాళ్లకి కామెడీ, ఎంటర్టైన్మెంట్ నచ్చాయి. అలా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని 'రాకాస' ఆకట్టుకోవడంతో థియేటర్లతో పాటుగా ఓటీటీలోనూ దుమ్ములేపేస్తోంది. సమ్మర్‌లో కూల్ మూవీగా, వేసవి సెలవుల్లో కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రంగా 'రాకాస' నిలిచింది. ఇక ఈ కారణంతోనే ఇప్పుడు ఓటీటీలో టాప్ ప్లేస్‌లో ట్రెండ్ అవుతోంది. నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ టాప్ 10లో 'రాకాస' ఎంట్రీని గమనిస్తే.. తెలుగు సినిమాకు పెరుగుతున్న అంతర్జాతీయ గుర్తింపును మరింతగా నొక్కి చెబుతున్నట్టుగా అనిపిస్తుంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై, జీ స్టూడియోస్ సహకారంతో నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సల్ నిర్మించిన ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. 'రాకాస' ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండ్ అవుతోంది.



## సూర్య, RJ బాలాజీ, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ 'వీరభద్రుడు' అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో మే14న గ్రాండ్ గా రిలీజ్

సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు' కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. ఈ చిత్రం ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, సాంగ్స్ భారీ అంచనాలని సృష్టించాయి. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది

## సతీలీలావతితో ఏంచెప్పాలనుకున్నారో..?

దాదాపు పదిహేనేళ్ళ క్రితం 'అందాల రాక్షసి' తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఉత్తరాఖండ్ బ్యూటీ లావణ్య త్రిపాఠి ఇవాళ తెలుగువారింటి కోడలు. కథానాయకుడు వరుణ్ తేజ్ తో ఆమె వివాహం 2023లో అయ్యింది. పెళ్ళికి ముందు లావణ్య త్రిపాఠి ఉమెన్ సెంట్రిక్ మూవీ 'హ్యాపీ బర్త్ డే' చేసింది. పెళ్ళి తర్వాత మరోసారి అదే తరహాలో 'సతీ లీలావతి' సినిమాలో టైటిల్ రోల్ ప్లే చేసింది. అప్పట్లో 'హ్యాపీ బర్త్ డే' ఆమెకు చేదు అనుభవాన్ని అందించింది. మరి ఇప్పుడు 'సతీ లీలావతి' ఎలాంటి అనుభవాన్ని అందించిందో చూద్దాం. చిన్నప్పటి నుండి తల్లిదండ్రులు (పవిత్ర లోకేష్, నరేశ్) చీటికీమాటికి కీచులాడుకోవడంతో చిన్నారి లీల (లావణ్య త్రిపాఠి) మానసికంగా బాగా డిస్టర్బ్ అవుతుంది. పెరిగి పెద్దయ్యాక సైకియాట్రిస్ట్ రామ్ సేతు (దేవ్ మోహన్) ఆమెలో కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచుతాడు. సేతులోని గుడ్ క్వాలిటీస్ నచ్చి అతన్నే ఆమె పెళ్ళాడుతుంది. సేతు కారణంగా ఆమె మూడేళ్ళలో స్టార్ డైరెక్టర్ గా ఎదుగుతుంది. అక్కడ నుంచే ఆమె కష్టాలు మొదలవుతాయి. భార్య షూటింగ్స్ బిజీలో తనను పట్టించుకోక పోవడంతో సేతు డిప్రెషన్ కు లోనవుతాడు. ఆ సమయంలో నర్స్ నికోలా సెబాస్టియన్ (మడోన్నా సబాస్టియన్) కు దగ్గరవుతాడు. భార్యకు విడాకులిచ్చి... నికోలాను పెళ్ళి చేసుకోవాలని సేతు అనుకుంటాడు. ఆ విషయాన్ని లీలకు చెప్పినప్పుడు ఆమె ఎలా రియాక్ట్ అయ్యింది? ప్రేమించి మరి పెళ్ళి చేసుకున్న భర్త దూరం అవుతాడని తెలిసి ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంది? ఈ ప్రేమజంట విడిపోయిందా? తప్పులు దిద్దుకుని జీవితాన్ని కొనసాగించిందా? దానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ?



అనేదే ఈ సినిమా కథ. చిన్న చిన్న కారణాల వల్ల భార్య భర్తలు విడిపోవడం చూస్తున్నాం. ఈ కథలోనూ అలాంటి సిల్లీ రీజనే దర్శకుడు తీసుకున్నాడు. భార్య దర్శకురాలని తెలిసి, ఆమె తనకు తగినంత సమయం ఇవ్వలేదని గుర్తించి, అదీ సైకాలజిస్ట్ అయిన ఓ వ్యక్తి అదే కారణంతో ఆమెకు విడాకులు ఇవ్వాలను కోవడం సిల్లీగా అనిపిస్తుంది. విడాకులు తీసుకోబోతున్న ప్రేమజంట అనేది ఈ మూవీలోని బేసిక్ పాయింట్! అందుకు కారణంగా చూపించిన పాయింట్ చాలా బలహీనంగా ఉండటంతో ఆ తర్వాత వచ్చే ఏ సన్నివేశాలతోనూ ప్రేక్షకుడు కనెక్ట్ కాలేని పరిస్థితి నెలకొంది. భార్యాభర్తలు ఎలాంటి అభిప్రాయభేదాలు ఉన్నా కలిసి కాపురం చేయాలంటూ లీల తల్లిదండ్రులనే దర్శకుడు ఉదాహరణగా చూపుతాడు. ఈ పాయింట్ ఎన్నో సినిమాలలో చూపించిందే! అందులో కొత్తదనం లేదు.





## రౌడీ జనార్ధన్ నుంచి ప్రత్యేక పోస్టర్ విడుదల

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర యూనిట్ అదిరిపోయే కానుక అందించింది. యువ దర్శకుడు రవికిరణ్ కోల దర్శకత్వంలో విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'రౌడీ జనార్ధన్. వరుస సినిమాలతో, విభిన్నమైన కథలతో ప్రేక్షకుల ముందుకువస్తున్నారు నటుడు విజయ్ దేవరకొండ. ప్రస్తుతం రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఆయన నటిస్తోన్న చిత్రం 'రౌడీ జనార్ధన్'. విజయ్ పుట్టినరోజు సందర్భంగా టీమ్ ప్రత్యేక పోస్టర్ పంచుకుంది. ఇప్పటివరకూ విజయ్ సీరియస్ లుక్‌లో ఉన్న ఫొటోలు పంచుకున్న చిత్రబృందం తాజాగా ఓ లవ్లీ పోస్టర్‌ను షేర్ చేసింది. 'ప్రపంచంతో పోరాడతాడు.. ప్రేమకు లొంగిపోతాడు' అంటూ విజయ్‌కు విషెస్ తెలిపింది. ఇందులో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ కనిపించనున్నారు. దిల్‌రాజు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఆయన ఇందులో విజయ్ పాత్ర గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. 'విజయ్ దేవరకొండ ఇప్పటివరకు విభిన్నమైన సినిమాలు చేస్తూ వచ్చాడు. కానీ, ఇలాంటి పూర్తిస్థాయి మాస్ పాత్ర ఇంతవరకు చేయలేదు. తొలిసారి ఈ సినిమాలో తనతో తూర్పుగోదావరి యాసలో మాట్లాడిస్తున్నాం. ఈ కథ విన్నప్పుడే నాకు చాలా వినూత్నంగా అనిపించింది. 80వ దశకం నేపథ్యంలోని ప్రపంచాన్ని మా సాంకేతిక నిపుణులంతా అద్భుతంగా పునఃసృష్టించారు' అని తెలిపారు. ఈ సినిమా నుంచి మేకర్స్ ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ ఇంటెన్స్ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. అతడి గుండెపై హీరోయిన్ కాలుపెట్టగా.. ప్రపంచంతో పోరాడే మొండివాడు.. కానీ ప్రేమకు మాత్రమే తలవంచుతాడు అంటూ ఈ పోస్టర్‌కి క్యాప్షన్ ఇచ్చారు. కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు.

## పెద్ది మూవీ అమెరికాలో రికార్డుల సృష్టి

సాధారణంగా ఒక సినిమా బాక్సాఫీస్ సత్తా ఏంటో తెలియాలంటే థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ అయ్యే వరకు వేచి చూడాలి. ట్రైలర్ ఇచ్చే కిక్కును బట్టే ఆ సినిమా మార్కెట్ పొటన్షియాలిటీ ఆధారపడి ఉంటుంది. కానీ, కొన్ని సినిమాలు మాత్రం ఈ లెక్కలకు అతీతం. కేవలం క్రేజీ కాంబినేషన్ మీద ఉన్న నమ్మకం, హీరో ఇమేజ్ ఇచ్చే ధైర్యంతోనే అంచనాలు ఆకాశాన్ని తాకుతుంటాయి. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ , సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సాన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది సినిమా సరిగ్గా ఇదే మ్యాజిక్ చేస్తోంది. పెద్ది సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి కూడా అంచనాలు ఆకాశాన్ని తాకుతూనే ఉన్నాయి. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ పెద్ది రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. ఇంకా ట్రైలర్ కూడా బయటకు రాకముందే నార్త్ అమెరికాలో రికార్డుల వేట మొదలైపోయింది. బుకింగ్స్ ప్రారంభించిన




కేవలం నాలుగు గంటల్లోనే 100ఐ మార్కును దాటి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటి వరకు ఏ భారతీయ సినిమాకు సాధ్యం కాని రీతిలో, అతి తక్కువ సమయంలో ఈ మైలురాయిని చేరుకోవడం ఒక్క రామ్ చరణ్‌కే చెల్లింది. మెగా అభిమానులు కళ్ళలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న జూన్ 3వ తేదీ రానే వస్తోంది. ఆ రోజు ఓవర్సీస్‌లో భారీ ఎత్తున ప్రీమియర్లతో పెద్ది జాతర మొదలుకానుంది. ఇప్పటి వరకు విడుదలైన టీజర్స్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఆ రా అండ్ రస్టిక్ లుక్స్ సినిమాపై విపరీతమైన ఆసక్తిని పెంచుతున్నాయి. ఇప్పటికే పెద్ది నుంచి రిలీజైన పాటలు, విజువల్స్ చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. అదేవిధంగా త్వరలో రాబోయే థియేట్రికల్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయం. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, అభిమానులను ఉర్రూతలూగించేలా బుచ్చిబాబు.. ప్రతి సీన్‌ను చెక్కినట్లు తెలుస్తోంది. పెద్ది ఒక ఎమోషనల్ అండ్ మాస్ ఎంట్టంల్గ÷నర్ అని, ఎక్కడా తగ్గకుండా హై వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ చిత్రం ఉండబోతోందని సినిమా యూనిట్ చెప్పుకొస్తోంది. పాన్ ఇండియా వైడ్ గా పెద్ది మేనియా ఇప్పుడిప్పుడే మొదలైంది. బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడానికి, సరికొత్త బెంచ్ మార్క్ సెట్ చేయడానికి గ్లోబల్ స్టార్ సిద్ధమైపోయాడు. మరి ఈ సినిమా థియేటర్లలో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380